


# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి బుధవారం 17-08-2022 సంపుటి : 04 సంచిక : 02 పేజీలు : 4 వెల : రూ 3-00


## 3 ఇండస్ట్రియల్ కారిడార్లు ఉన్న రాష్ట్రం ఏపీ మాత్రమే: సీఎం జగన్



అచ్యుతాపురం(అనకాపల్లి జిల్లా): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లిజిల్లా అచ్యుతాపురంలో ఏపీ ఎస్ఈజెడ్‌లో ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ ఫస్ట్ ఫేజ్‌ను మంగళవారం ప్రారంభించారు. అనంతరం మరో 8 కంపెనీలకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ..ఈ రోజు ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. దేవుడి దయతో ఒక పరిశ్రమను ప్రారంభోత్సవం చేసుకోవడంతోపాటు, రెండో దశ ప్లాంట్ విస్తరణ పనులకూ శంకుస్థాపన చేశాం. యోకహోమా జపనీస్ టైర్ల తయారీ పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ.. కంపెనీ గురించి చెప్పారు. ప్రపంచంలోనే అత్యుత్తమంగా మొదటి 5?6 స్థానాల్లో తమ కంపెనీ ఉందని, రాబోయే రోజుల్లో టాప్ 3లోకి పోబోతున్నామని చెప్పారు. అలాంటి కంపెనీ మన రాష్ట్రానికి రావడం సంతోషకరం. 2020 సెప్టెంబరులో మన దగ్గరకు వచ్చారు. అక్కడనుంచి చకచకా అన్ని రకాలుగా మద్ధతు ఇచ్చే కార్యక్రమం చేశాం. ఫిబ్రవరి 2021లో పనులు ప్రారంభించి కేవలం 15 నెలల కాలంలోనే ఫ్యాక్టరీ ఉత్పత్తిలోకి వచ్చింది.మనమిచ్చే ప్రోత్సాహం, మద్దతు వారిని ఆకట్టుకుంది. అందుకే రెండోదశకు కూడా నాందిపలుకుతున్నారు. ఒకవైపు తొలిదశ ప్రాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుంటే.. మరోవైపు సెకెండ్ ఫేజ్‌కు శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుంది. ఈ రెండో దశ కూడా సరిగ్గా 12 నెలల్లోనే ఆగష్టు 2023లోగా పూర్తి చేస్తామని చెప్తున్నారు. తొలిదశలో రూ.1250 కోట్ల రూపాయలతో దాదాపు 1200 మందికి ఉద్యోగాలు ఇక్కడే కల్పించారు. ఇవాళ మొదలయ్యే రెండోదశలో మరో రూ.850 కోట్లతో పనులు చేపట్టడంతో పాటు మరో 800 మందికి ఉద్యోగాలు వస్తాయి. మొత్తంగా 2000 మందికి ఉపాధి ఇక్కడే.. మన పిల్లలకే అందుబాటులోకి వస్తుంది.ఇవన్నీ కూడా ఎందుకు చెపుతున్నానంటే.. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, బాగుపడాలన్నా ఆ ప్రాంతంలో మన పిల్లలకు మెరుగైన ఉద్యోగాలు అందడం చాలా అవసరం. అలా ఆ ప్రాంతంలో చదువుకున్న మన పిల్లలకు మంచి ఉద్యోగాలు ఇక్కడే మనం ఇప్పించగలిగితే.. పేదరికం నుంచి మన పిల్లలు బయటపడే పరిస్థితులు ఇంకా మెరుగవుతాయి. దీనికోసం ప్రభుత్వం పరంగా మనం చేయాల్సినవి అన్నీ కూడా వేగంగా అడుగులు ముందుకు వేస్తున్నాం. ఇవాళ రాష్ట్రంలో వేగంగా పారిశ్రామిక రంగంలో అడుగులు పడుతున్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మనం ఈరోజు గత మూడు సంవత్సరాలుగా దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా మనమే అవార్డు తీసుకుంటున్నాం. మొట్టమొదటి సారిగా ఈ సారి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సర్టిఫికేషన్ చేసేముందు దాని తీరును కూడా మార్చారు. మొట్టమొదటిసారిగా ఆ రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వ్యక్తులతో వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని వాటికి అనుకూలంగానే ఈజ్‌ఆఫ్ డూయింగ్‌బిజినెస్ ర్యాంకింగ్ ఇస్తున్నారు. అలా రూల్స్ మార్చిన నేపథ్యంలో వరుసగా మూడేళ్లుగా ఏపీ నంబర్ 1 ర్యాంకు సాధిస్తోంది. ఇవాళ ప్రతి అడుగులో కూడా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నాం.గతంలో పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇచ్చేవారు కాదు. ఏళ్ల తరబడి పరిశ్రమల ప్రోత్సాహకాలు పేరుకుపోయాయి. ఆ నేపథ్యంలో చిన్నా చితకా పరిశ్రమలు నడవలేక మూతబడుతున్న పరిస్థితులు.

## బిహార్‌లో కొలువుదీరిన మంత్రివర్గం..

### రాజ్‌భవన్‌లో మంత్రుల ప్రమాణం




పాట్నా : బిహార్‌లో కొత్త మంత్రివర్గం కొలువుదీరింది. పాట్నాలోని రాజ్‌భవన్‌లో కొత్త మంత్రులతో గవర్నర్ ఫగు చౌహాన్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి తేజస్వియాదవ్ హాజరయ్యారు. మరో వైపు నితీశ్ కేబినెట్‌లో తేజ్‌ప్రతాప్‌కు మరోసారి చోటు దక్కింది. దీంతో ఆయన నలుగురు ఎమ్మెల్యేలతో కలిసి ప్రమాణస్వీకారం చేశారు. మొదట మంత్రులుగా విజయ్‌కుమార్ చౌదరి (జేడీయూ), విజేందర్ యాదవ్ (జేడీయూ), అలోక్ మెహత (ఆర్‌జేడీ), తేజ్ ప్రతాప (ఆర్‌జేడీ), అఫాక్ ఆలం (కాంగ్రెస్)తో గవర్నర్ ప్రమాణం చేయించారు.జేడీయూ నుంచి తేజస్వి యాదవ్‌తో కలిసి మొత్తం ప్రభుత్వం 16 మంత్రి పదవులు దక్కాయి. ఆర్‌జేడీ నుంచి తేజ్ ప్రతాప్ యాదవ్, సమీర్ మహాసేత్, వీరేంద్ర , అక్తరుల్ షాహీన్, అలోక్ మెహతా, అనితా దేవి, రామానంద్ యాదవ్, లలిత్ యాదవ్, సురేంద్ర యాదవ్, చంద్రశేఖర్, సుధాకర్ సింగ్, సర్వజిత్ కుమార్, సురేంద్ర రామ్, షానవాజ్, భరత్ భూషణ్ మండల్.. జేడీయూ నుంచి విజయ్ చౌదరి, సంజయ్ ఝా, సునీల్ కుమార్, శ్రవణ్ కుమార్, బిజేంద్ర యాదవ్, అశోక్ చౌదరి, షీలా మండల్, జమా ఖాన్, లేషి సింగ్, జయంత్ రాజ్, మదన్ సాహ్ని.. కాంగ్రెస్ నుంచి అఫక్ ఆలం, మురారీ, ప్రసాద్ గౌతమ్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.

## ఎంపీ మాధవ్ వ్యవహారంపై సీబీఐకి న్యాయవాది ఫిర్యాదు




అమరావతి : ఏపీలోని హిందూపురం వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ అంశంపై ఏపీ హైకోర్టు న్యాయవాది సీబీఐకి ఫిర్యాదు చేశారు. లక్ష్మీనారాయణ అనే న్యాయవాది ఎంపీపై ఫిర్యాదును ఈ -మెయిల్ ద్వారా చెన్నై కార్యాల యానికి పంపించారు. ఫిర్యాదు పత్రంతో పాటు మాధవ్‌కు సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌ను జత చేసి పంపించారు. వీడియోకాల్ లో మహిళతో అసభ్యకరంగా వ్యవహరించిన తీరు జుగుప్సగా ఉందని పేర్కొన్నారు.వీడియో కాల్ ను ఒక సామాజిక వర్గం వారు చేసి తనను అప్రదిష్టపాలు చేస్తున్నారని ఎంపీ చేసిన వ్యాఖ్యలతో రెండువర్గాల మధ్య విధ్వేషాలు చెలరేగే అవకాశముందని ఆయన తెలిపారు. ఎంపీ మాధవ్‌పై సీబీఐ సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## టీడీపీ హయాంలో దేవుడి మాన్యాలు అన్యాక్రాంతం: ఏపీ మంత్రి సత్యానారాయణ



అమరావతి : టీడీపీ హయాంలో దేవాలయాలకు చెందిన భూములు అన్యాక్రాంతమయ్యాయని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆరోపించారు. కోట్ల రూపాయలు దోచుకున్నా చంద్రబాబు ప్రభుత్వం చూస్తూ కూర్చున్నదని చెప్పారు. పలు మఠాల్లో అక్రమాలు జరిగినా చర్యలు తీసుకోలేదన్నారు. ప్రస్తుతం ఏర్పాటైన ఏపీ ధార్మిక పరిషత్ ఇకపై ఇలాంటి అక్రమాలపై దృష్టి సారిస్తుందని స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.దేవుడి మాన్యం భూములపై పూర్తి హక్కు దేవాదాయ శాఖకు మాత్రమే ఉంటుందని, ఆయా భూములపై వచ్చే ఫలసాయంపై మాత్రమే అర్చకులకు హక్కు ఉంటుందని మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. దేవాదాయశాఖ పరిధిలో 4 లక్షల ఎకరాలకు పైగా భూములు ఉన్నాయని, కోర్టు వివాదాల్లో ఉన్న ఆలయ భూములు, కేసుల పురోగతి తెలుసుకునేందుకు త్వరలో వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు. టీడీపీ హయాంలో అన్యాక్రాంతమైన ఆస్తులు, కొన్ని మఠాల్లో జరిగిన అక్రమాలపై ఇవాళే ఏర్పాటుచేసిన ధార్మిక పరిషత్ చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖలో ధార్మిక పరిషత్ నిర్ణయాలే కీలకమన్నారు.హిందు ధర్మ పరిరక్షణలో భాగంగా ప్రతీ గ్రామంలో ఒక ఆలయానికి ధూప, దీప నైవేద్యం చేపట్టేందుకు ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. దేవాదాయ శాఖలో ఉద్యోగుల కొరత కారణంగా పరిపాలనా సౌలభ్యం కోసమే రెవెన్యూ ఉద్యోగులను దేవదాయ శాఖలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు.

## నదిలోకి దూసుకెళ్లిన బస్సు..

### ఆరుగురు ఐటీబీపీ సిబ్బంది మృతి



పహల్గామ్: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో బస్సు నదిలో పడింది. ఆ బస్సులో ఐటీబీపీ జవాన్లు ప్రయాణిస్తున్నారు. ఆ బస్సులో మొత్తం 39 మంది భద్రతా సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. దాంట్లో 37 మంది ఐటీబీపీ, ఇద్దరు కశ్మీర్ పోలీసులు ఉన్నారు. ఫ్రిస్లాన్ వద్ద బస్సు బ్రేక్‌లు ఫెయిలవ్వడంతో.. ఆ బస్సు నదిలోకి దూసుకువెళ్లింది. అమర్‌నాథ్ యాత్ర వద్ద విధులు నిర్వర్తిస్తున్న జవాన్లు ఆ బస్సులో ఉన్నారు. చందన్‌వారి నుంచి పెహల్గామ్‌కు భద్రతా దళాలు ప్రయాణిస్తున్నాయి.ఈ ప్రమాదంలో ఆరుగురు సైనికులు మృతిచెందినట్లు తెలుస్తోంది. గాయపడ్డ పోలీసుల్ని శ్రీనగర్‌లో హాస్పిటల్‌కు తరలించారు. బస్సు ప్రమాదంలో 30 మంది సైనికులు గాయపడినట్లు అనంతనాగ్ డాక్టర్ సయ్యిద్ తారిక్ తెలిపారు.చందన్‌వారి ప్రమాదంలో ఐటీబీపీ సైనికుల మృతి పట్ల ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడ్డ సైనికులు త్వరగా కోలుకోవాలని కోరారు. గాయపడ్డవారికి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు.

## ఎట్టకేలకు ఏపీలో ధార్మిక పరిషత్ ఏర్పాటు




అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎట్టకేలకు ధార్మిక పరిషత్ ఏర్పాటైంది. ధార్మిక పరిషత్‌ను నెలకొల్పుతూ జగన్ సర్కార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిషత్‌లో మొత్తం 21 మంది సభ్యులుగా ఉండనున్నారు. ఈ కొత్త పరిషత్ పదవీ బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి మూడేండ్ల పాటు కొనసాగుతుంది. రెండేండ్ల క్రితం తమను ధార్మిక పరిషత్ నుంచి తొలగించడంపై తిరుపతి హథీరాంజీ మఠాధిపతి హైకోర్టును ఆశ్రయించడంతో పూర్తి స్థాయి ధార్మిక పరిషత్ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. రూ.25 లక్షల నుంచి రూ. కోటి పైన ఆదాయం ఉన్న ఆలయాలకు పాలకవర్గాల నియామకం ఈ పరిషత్ ద్వారా జరుగుతుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేసింది. పరిషత్ ఛైర్మన్‌గా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వ్యవహరించనున్నారు. రాష్ట్రంలోని దేవదాయ శాఖ పరిధిలో ఉండే ఆలయాలు, మఠాలు, సత్రాలు, ఇతర హిందూ ధార్మిక సంస్థల వ్యవహారాలపై ప్రభుత్వ పరంగా తీసుకొనే విధాన నిర్ణయాల్లో ఈ పరిషత్ కీలకంగా వ్యవహరిస్తుంది. ఈ పరిషత్‌లో ఇద్దరు మఠాధిపతులు, ఇద్దరు ఆగమ పండితులు, ఓ రిటైర్డు హైకోర్టు జడ్జి, ఓ రిటైర్డు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి, ఓ రిటైర్డు ఐఏఎస్ అధికారి, ఒక చార్టెడ్ అకౌంటెంట్, ఒక రిటైర్డు దేవదాయ శాఖ అధికారితో పాటు ఇద్దరు దాతలు, వివిధ ఆలయాల పాలక మండళ్ల ఛైర్మన్లు ఆరుగురిని సభ్యులుగా నియమించారు. దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, టీటీడీ ఈఓ సభ్యులుగా కొనసాగగా.. దేవదాయ శాఖ కమిషనర్ సభ్య కార్యదర్శిగా ఉంటారు.ఈ ధార్మిక పరిషత్‌లో తిరుమలలోని పెద్ద జియ్యంగార్ మఠం, కడప జిల్లాలోని పుష్పగిరి మఠంకు అవకాశం కల్పించారు. ఆగమ పండితులు పీవీఎస్ఎస్ఆర్ జగన్నాథాచార్యులు, సీహెచ్ శ్రీరామ శర్మకు పరిషత్‌లో స్థానం కల్పించారు. అలాగే, శ్రీరామమూర్తి (సీఏ), ఏబీ కృష్ణారెడ్డి (దేవదాయ శాఖ రిటైర్డ్ అధికారి) దాతలు ఎన్ నరసింహారావు, యూకే విశ్వనాథ్‌రాజు, ఎం రామకుమార్ రాజు (భీమవరం జగన్నాథరాజు సత్రం), చక్కా ప్రభాకరరావు (పాలకొల్లు చాకా వారి సత్రం), జ్వాలా చైతన్య (కడప యడ్ల పిచ్చయ్య శెట్టి సత్రం), ఇనుగంటి వెంకట రోహిత్ (అన్నవరం), మాక్కా బాలాజీ, రంజన్ సుభాషిణిలకు కూడా పరిషత్‌లో సభ్యులుగా ప్రభుత్వం నియమించింది.

## అభివృద్ధిలో ఏపీ ప్రభుత్వం విఫలం : సోము వీర్రాజు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీజేపీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఆరోపించారు. కేంద్రం ఇస్తున్న నిధులను సక్రమంగా



వాడుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర పథకాలకు సొంతపేర్లు పెట్టుకోవడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. కేంద్రం రాష్ట్రానికి ఇండ్లను మంజూరు చేయగా వాటిని పూర్తి చేయడంతో నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు.ఏపీ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 21న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బటన్ నొక్కడమే పనిగా పెట్టుకున్న ప్రభుత్వం అమరావతి నిర్మాణానికి నిధులిస్తే ఏపీకి అసలు రాజధానే లేకుండా చేశారని దుయ్యబట్టారు.

## ఏపీలో పవన్ కల్యాణ్ కండువా కప్పుకున్న వైసీపీ నేత

మంగళగిరి: ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడే నేతలు పార్టీలు మారుతున్నారు. తమ తమ నియోజకవర్గాల్లో ప్రస్తుతమున్న పార్టీ నుంచి టికెట్ దొరకదని భావిస్తున్న నేతలు టికెట్ ఇచ్చే పార్టీ కోసం ఇప్పటి నుంచే వెతుకుతున్నారు. తాజాగా వైసీపీ సీనియర్ నేత ఒకరు పవన్ కల్యాణ్ జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గత 35 ఏండ్లుగా రాజకీయాల్లో ఉన్నా తనకు ఎమ్మెల్యేగా అవకాశం రాకపోవడంతో గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నట్లు సమాచారం.గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం కొల్లిపరకు చెందిన వైసీపీ నేత వుయ్యూరు శివ రామిరెడ్డి పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఆయనకు పవన్ కల్యాణ్ తమ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జనసేన పార్టీలో చేరడం తనకు సంతోషంగా ఉన్నదని ఈ సందర్భంగా శివరామిరెడ్డి మీడియాతో అన్నారు.వుయ్యూరు శివరామిరెడ్డి 1987 లో తెలుగుదేశం పార్టీలో చేరి.. మూడేండ్ల పాటు మండల అధ్యక్షుడిగా ఉన్నారు. చిరంజీవి



ప్రజారాజ్యం పార్టీ ప్రారంభించడంతో ఆయన వంచన చేరి గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడయ్యారు. 2012 లో వైసీపీలో చేరారు. జగన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు విసుగు చెంది పవన్ కల్యాణ్ వెంట నడిచేందుకు నిర్ణయించుకున్నట్లు శివరామిరెడ్డి చెప్పారు. కాగా, తెనాలి నియోజకవర్గం జనసేన ఇంఛార్జ్‌గా నాదెండ్ల మనోహర్ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

# సంపాదకీయం

బుధవారం 17-08-2022

## విభజించు పాలించే విధానమేనా....

ఎన్డీయే ఖాళీ అవ్వడం వెనుక బీజేపీ వ్యూహం ఉందా? ఉద్దేశ పూర్వకంగానే మిత్రపక్షాలను కూటమి వీడేలా బీజేపీ వ్యవహరిస్తోందా? 2024 ఎన్నికలలో ఒంటరిగా బరిలోకి దిగడమే రాజకీయంగా తమకు లబ్ధి చేకూరుతుందని భావిస్తోంది.ఆ పార్టీ చెబుతున్న డబుల్ ఇంజిన్ అర్థం ఇదేనా? దేశ వ్యాప్తంగా అన్నిరాష్ట్రాలలోనూ అధికారం చేజిక్కించుకోవాలంటే ముందుగా ఆయా రాష్ట్రాలలో ఉన్న ప్రాంతీయ పార్టీలను బలహీనం చేయాలన్నదే ఆ పార్టీ లక్ష్యమా? అంటే పరిశీలకులు ఔననే అంటున్నారు. వారి వ్యూహానికి బీహార్ లోని జేడీయూ అధినేత బ్రేక్ వేశారా? బీహార్ లో బీజేపీ వ్యూహం బెడిసికొట్టిందా? అంటే కూడా ఔననే అంటున్నారు. ఎన్డీయే కూటమి నుంచి ఒక్కటొక్కటిగా పార్టీలు వైదొలగడానికి కారణం బీజేపీ వ్యవహరిస్తున్న తీరే కారణమని విశ్లేషకులు సైతం చెబుతున్నారు.అవసరార్థం ప్రాంతీయ పార్టీలతో పొత్తులు కుదుర్చుకోవడం.. ఆ తరువాత అనకొండలా వాటిని మింగేయడానికి ప్రయత్నించడం.. కాశ్మీర్ నుంచి మహారాష్ట్ర వరకూ బీజేపీ అనుసరించిన వైఖరి ఇదేనని చెబుతున్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న అన్ని ప్రాంతీయ పార్టీలూ పొత్తు విచ్ఛిన్నమయ్యే సమయానికి తమ స్వరాష్ట్రంలో బలహీనపడిన ఉదంతాలే ఉన్నాయని అంటున్నారు. బీహార్ పరిణామం తరువాత బీజేపీతో మైత్రి చెడిన పార్టీల నుంచి ఇంకా పొత్తులో కొనసాగుతున్న పార్టీల వరకూ అన్ని నితీష్ వ్యూహాలను ప్రశంసిస్తున్నారు. ఆయన కీలెరిగి బీజేపీకి వాత పెట్టారని ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో మెజారిటీ రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో ఉండడానికి కారణం.. ఆయా రాష్ట్రాలలో అవసరార్థం పొత్తులు కుదుర్చుకుని.. వాటి అండతో రాష్ట్రంలో బలపడి.. ఆ తరువాత వాటినే టార్గెట్ చేయడం బీజేపీ గత ఎనిమిదేళ్లుగా అనుసరిస్తున్న వ్యూహంగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పుడు నితీష్ టార్గెట్ చేసిందనేది కూడా ఓ ఆరోపణ. నిజానికి వరుస పరిణామాలకు ఈ మాటలకు మరింత బలం చేకూర్చేలా కనిపిస్తున్నాయ్. ఇప్పుడు బిహార్ మాత్రమే కాదు.. ఈ మధ్యే ముగిసిన మహారాష్ట్ర పంచాయితీతో పాటు.. పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్‌తో దోస్తీకి కూడా బ్రేక్ పడింది. బీహార్ విషయానికి వస్తే.. ఆ రాష్ట్రానికి చెందిన లోక్ జనశక్తి పార్టీ.. ఎన్డీఏలో ఒకప్పుడు భాగంగా ఉండేది. రామ్‌విలాస్ పాశ్వాన్ మరణం తర్వాత ఎల్‌జేపీ పగ్గాలు చేపట్టిన ఆయన కుమారుడు చిరాగ్ పాశ్వాన్‌ను బీజేపీ పావుగా వాడుకొందన్న విమర్శలున్నాయి. బీహార్ ఎన్నికల్లో జేడీయూ అభ్యర్థులున్న చోట బలమైన క్యాండిడేట్లను నిలబెట్టడం ద్వారా ఓట్లను చీల్చింది ఎల్‌జేపీ. ఎన్నికలయ్యాక చిరాగ్‌ను పట్టించుకోవడం మానేసింది బీజేపీ నాయకత్వం. అదే సమయంలో ఎల్‌జేపీలో చెలరేగిన తిరుగుబాటు సమయంలో ? చిరాగ్ పాశ్వాన్ స్థానంలో ఆయన బాబాయి పశుపతి కుమార్ పరాస్‌కు బీజేపీ మద్దతుగా నిలబడింది. ప్రస్తుతం ఎల్ జేపీ పూర్తిగా పశుపతి హ్యాండోవర్‌లో ఉంది. పాశ్వాన్ వారసుడిగా చక్రం తిప్పుదామనుకున్న చిరాగ్.. బీహార్ పాలిటిక్స్‌లో కంప్లీట్‌గా సైడ్ అయిపోయారు.ఇక మహారాష్ట్ర సంగతి తలిసిందే. ఒకప్పుడు శివసేన మద్దతుతో మహారాష్ట్రలో నిలబడ్డ బీజేపీ.. ఇప్పుడు ఆ పార్టీనే మింగేసిందనే చెప్పాలి. సీఎం పదవి విషయంలో వచ్చిన పేచీతో ఎన్నో ఏళ్లుగా కలిసి వస్తున్న శివసేనకు రాం రాం చెప్పేసింది బీజేపీ. అటు కాంగ్రెస్, ఎన్సీపీతో శివసేన ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెండున్నరేళ్లు పూర్తికాకముందే.. శివసేనలో రేగిన అసమ్మతిని తమకు పూర్తి అనుకూలంగా మార్చుకున్న కమలం పార్టీ వ్యూహాలతో ఉద్ధవ్ థాక్రే మల్లగుల్లాలు పడుతున్నారు. కనీసం పార్టీ చిహ్నం అయినా తమకు దక్కుతుందా? దక్కదా అన్న అయోమయంలో ఉద్ధవ్ థాక్రే ఉన్నారు. పేరుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ షిండే అయినా పగ్గాలు మొత్తం బీజేపీవే అన్నట్లుగా ఇప్పుడు మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వం మనుగడ సాగుతోంది. ఇక తమిళనాడులోనూ ఇదే పరిస్థితి. శిరోమణి అకాలీదళ్ వ్యవసాయ చట్టాల విషయంలో విభేదించి ఎన్డీయేకు గుడ్ బై చెప్పింది. అటు అమరీందర్ సింగ్ కాంగ్రెస్ గుడ్ బై చెప్పేదాకా వెంటపడింది. చివరకు బీజేపీ ఉచ్చులో చిక్కుకుని అమరీందర్ సొంత కుంపటి పెట్టగానే ఆయన పార్టీతో పొత్తు పెట్టుకుంది. అయితే ఈ పొత్తు పంజాబ్ ఎన్నికలలో ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయినా.. కాంగ్రెస్ ను అధికారం నుంచి దూరం చేయడానికి మాత్రం దోహదపడింది. అంతే కాకుండా కాంగ్రెస్ నేతగా, పంజాబ్ సీఎంగా తిరుగులేని నేతగా ఉన్న అమరీందర్ ను ఇప్పుడు రాష్ట్రంలో నామమాత్రపు నేతగా మార్చేసింది.దేశవ్యాప్తంగా అధికారంలో ఉండాన్న పట్టుదలతో బీజేపీ మిత్రుడు, శత్రువు అని తేడా లేకుండా వ్యూహాలు రచిస్తోందని పరిశీలకులు అంటున్నారు.అక్రమంలోనే మిత్ర పక్షాలను బలహీనం చేసి, లేదా మింగేసి ఆయా రాష్ట్రాలలో బలోపేతం అయ్యేందుకు ఎత్తులు వేస్తోందని పరిశీలకులు అంటున్నారు. ఎవ్రీథింగ్ ఈజ్ ఫెయిర్ ఇన్ లవ్ అండ్ వార్ అన్న నానుడికి బీజేపీ.. పాలిటిక్స్ కూడా చేర్చేసిందని అంటున్నారు.

# రోజాకు లోకల్ టెన్షన్



తిరుపతి, ఆగస్టు 16, మంత్రి రోజాకు కొత్త సమస్య వచ్చి పడిందట. అది కూడా అధినేత వల్లే ఆ సమస్య వచ్చిపడిందని సమాచారం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసనసభ నియోజకవర్గాల్లోని స్థానిక నాయకులతో భేటీ అయ్యే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు సీఎం జగన్. జయాపజయాలతో నిమిత్తం లేకుండా పార్టీ కోసం తొలి నుంచి పనిచేస్తున్న కార్యకర్తలకు, స్థానిక నాయకుల మధ్య సయోధ్య తగ్గుతోందనే ప్రచారం ఊపందుకుంటోంది. ఈ ప్రచారంలో వాస్తవాలను తెలుసుకొని అవసరమైన నష్ట నివారణ చర్యలు తీసుకోవడంతో పాటు సామాన్య కార్యకర్తలకు తానున్నాననే ధీమాను ఇవ్వాలని భావిస్తున్నారట అధినేత. వివిధ శాసనసభ నియోజకవర్గాల వారీగా పార్టీ కోసం పనిచేసేవారితో, స్థానికంగా కీలక పదవులలో కొనసాగుతున్న వారితోనూ ముఖాముఖి మాట్లాడి వాస్తవాలను తెలుసుకునేందుకు కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు.ఇక?అందులో బాగంగానే తొలి భేటీ కార్యక్రమానికి చిత్తూరు జిల్లాకు చెందిన కుప్పం నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకున్నారు జగన్. ఇప్పటికే వాళ్ళతో భేటి అయ్యారు. ఇప్పుడు నియోజకవర్గం ఏంటనే చర్చ నేతల్లో మొదలైందట. ముఖ్యంగా మంత్రి రోజాకు ఈ టెన్షన్ ఎక్కువైందని టాక్. అసలే గ్రూపులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది నగరి నియోజకవర్గం. ఇక్కడి నుంచి నేతలు అందరినీ అధినేత జగన్ వద్దకు ఎలా తీసుకొని వెళ్లాలని తెగ టెన్షన్ పడుతోందట రోజా వర్గం.2014, 2019 ఎన్నికల్లో విజయం సాధించిన నియోజకవర్గంలో పార్టీలోని గ్రూపు గోల రోజాకు పెద్దగా తలనొప్పిగా మారిందట. పంచాయతీ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు ఎప్పుడూ ఏదో ఒక రచ్చ అక్కడ జరగాల్సిందే. రోజా ప్రత్యర్థి వర్గం సమావేశం ఏర్పాటు చేసుకుందట. రోజా మంత్రి అయ్యాక వ్యతిరేక వర్గం దూకుడు తగ్గలేదు. నగరి ప్లీనరీకి అందరూ డుమ్మా కొట్టారు. రోజా సైతం వారిని పిలవలేదు. తాజాగా గ్రానైట్ గొడవ తారాస్థాయికి చేరింది. ఇలాంటి సమయంలో అధినేత నియోజకవర్గాల మీటింగ్‌కు ఎలా వెళ్లాలో అనే ఆలోచన రోజాను తెగ ఇబ్బంది పెడుతోందని సమాచారం. వ్యతిరేక వర్గానికి చెప్పాలా?చెప్పకుండా వెళ్ళాలా?అలా వెళితే జగన్ ఏం అంటారోనని టెన్షన్‌లో ఉన్నారట. వ్యతిరేక వర్గం సైతం రోజా మీటింగ్‌కు పిలవకపోతే ఏం చేయాలన్నదానిపై యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నారట.కెకె కుమార్, రెడ్డివారి చక్రపాణిరెడ్డి,అమ్ములు సహా అందరూ కీలక నేతలే కావడంతో వీరిని వదిలేసి అమరావతికి వెళితే పరిస్థితి ఏంటనే డైలామాలో ఉన్నారట మంత్రి రోజా. మీటింగ్ కోసం ముందస్తుగా వడమాలిపేటలోని కొద్దిమంది నేతలతో సమావేశమైన రోజాకు షాక్ ఇచ్చారట అక్కడి నేతలు. ఆమె ముందే ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారట. చివరికి మాటమాటా పెరిగి కొట్టుకునే స్థాయిలో గొడవ జరిగిందనే ప్రచారం సాగుతోంది. దీంతో అధినేత దగ్గర జరిగే సమావేశంలోనూ ఇలానే జరిగితే ఇక అంతే సంగతి అని రోజా వర్గంలో హాట్‌హాట్‌గా టాక్ నడుస్తోందట.ఐతే?అధినేత జగన్ ముందుకు ఎవర్ని తీసుకెళ్లాలనే దానిపై రోజా తేల్చుకోలేకపోతున్నారట. తన నియోజకవర్గం వంతు ఎప్పుడు వస్తుందో ఏమో కానీ..ఈ వర్గాలు..ఆ వర్గాల్లోని కొందరు తన మీదే పడటంతో ఆమె కంగారు పడుతున్నారట. గిట్టని వారిని పక్కనపెట్టి..వదిలేసి వెళ్తే ఏం కొంప మునుగుతుందోననే భయంతో ఓ పక్క..ఇంకో పక్క తీసుకెళ్తే జగన్ ముందు తన చిట్టా విప్పితే ఏం అవుతుందోననే బెంగ మంత్రిని వేధిస్తోందట.మరి ఇన్నాళ్లూ ఒక లెక్క.. జరగబోయే మీటింగు ఓ లెక్క అన్నట్లుగా పరిస్థితి మారింది. మంత్రి రోజా ఏం చేస్తారన్నదే ప్రస్తుతం ఆసక్తిగా మారింది.

# అధికారుల మధ్య బదిలీల రచ్చ

కర్నూలు, ఆగస్టు 16, ఈయన సిద్ధార్థ కౌశల్. కర్నూలు జిల్లా ఎస్పీ. ఈయనేమో రఘువీర్‌రెడ్డి. నంద్యాల జిల్లా ఎస్పీ. ఇద్దరు అధికారుల మధ్య పోలీసుల బదిలీలు పెద్ద వివాదానికి దారితీశాయి. అది పోలీస్ శాఖలో పెద్ద చర్చగా మారింది. సమస్య శ్రుతిమించకుండా పోలీస్ బాస్‌లు ఎలా పరిష్కరిస్తారన్నది ప్రస్తుతం ఆసక్తిగా ఉంది. ఏఎస్ ఐనుంచి కానిస్టేబుల్ వరకు దాదాపు 66 మందిని బదిలీ చేస్తూ కర్నూలు ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే అది తన పరిధిలోని కర్నూలు జిల్లాకే పరిమితం కాకుండా.. పొరుగునే ఉన్న నంద్యాల జిల్లా నుంచి కొందరిని కర్నూలు జిల్లాకు.. కర్నూలు జిల్లా నుంచి మరికొందరిని నంద్యాల జిల్లాకు ట్రాన్స్ ఫర్ చేశారు. ఇదే సమస్యకు కేంద్రంగా మారింది. తమ జిల్లాలో కూడా కర్నూలు ఎస్పీనే బదిలీలు చేయడాన్ని నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి తప్పు పట్టారట. అంతేకాదు.. కర్నూలు జిల్లాకు బదిలీ అయిన నంద్యాల పోలీసులను రిలీవ్ చేయలేదట. అలాగే కర్నూలు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన వాళ్లను నంద్యాల జిల్లాలో విధుల్లోకి తీసుకోలేదట. సిబ్బంది ట్రాన్స్‌ఫర్లపై ఒక్క మాట చెప్పకుండా.. చర్చించకుండా.. ఏకపక్షంగా బదిలీ చేయడాన్ని డిపార్ట్‌మెంట్‌లోనూ ప్రశ్నిస్తున్నట్టు సమాచారం.కర్నూలు ఎస్పీ సిద్ధార్థకౌశల్ ఉత్తర్వులపై డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారట నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి. దాంతో ఆ సమస్య ఏంటో పరిశీలించి? పరిష్కరించాలని కర్నూలు రేంజ్ పరిధిలోని ఉన్నతాధికారికి సూచించారట డీజీపీ. ఇక్కడే సమస్య మరో మలుపు తిరిగినట్టు తెలుస్తోంది. బదిలీల వ్యవహారం పక్కన పెట్టి.. సమస్యను తన దృష్టికి తీసుకురాకుండా నేరుగా డీజీపీకి ఫిర్యాదు చేయడంపై ఆ అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారట. పోలీస్ శాఖలో ఇది మరో రగడను రాజేసినట్టు సమాచారం. దీనిపై ఖాకీ వర్గాల్లోనే రకరకాలుగా చర్చ జరుగుతోందట. సమస్య వస్తే జిల్లా స్థాయిలో ఐపీఎస్‌లకు చెప్పుకొంటారని.. అదే ఐపీఎస్‌ల మధ్యే ఇబ్బందులు వస్తే ఎవరికి చెబుతారని కొందరు ప్రశ్నిస్తున్నారట.ఈ సమస్యను ఎలా తెగ్గొడతారో కానీ.. బదిలీ అయిన సిబ్బంది పరిస్థితి గందరగోళంలో పడింది. కర్నూలు జిల్లాలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఒకరిని ఏఎస్ ఐగా పదోన్నతి కల్పించి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో పోస్టింగ్ ఇచ్చారు ఎస్పీ సిద్ధార్థ కౌశల్. తాజా గొడవలో ఆ బదిలీ డైలమాలో పడింది. జిల్లాల విభజన తర్వాత .. ఎక్కడికక్కడ ఊహాలు వచ్చేశారు. వాళ్ల పరిధిలోనే పరిపాలన సాగుతోంది. కానీ.. సాంకేతికంగా కొన్ని చిక్కుముళ్లు అలాగే ఉండిపోయాయో ఏమో.. తాజా ఘటన పోలీస్ శాఖలోనే పెద్ద చర్చగా మారింది. మరి.. ఇద్దరు జిల్లా స్థాయి అధికారుల మధ్య తలెత్తిన సిబ్బంది ట్రాన్స్‌ఫర్ల సమస్యను ఎలా పరిష్కరిస్తారో చూడాలి.

# టీడీపీలో కుంపట్లు.... వేరయా

కర్నూలు, ఆగస్టు 16, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీకి పెట్టనికోటనేది ఒకప్పటి మాట. టీడీపీ నేతల మధ్యే నిత్యం పోరాటమనేది ఇప్పటి మాట. ప్రత్యర్థి పార్టీపై పోరు కంటే సొంత పార్టీలోని నేతలపైనే బాణాలు ఎక్కు పెడుతున్నారు నాయకులు. సోషల్ మీడియాలో పోస్టులు.. ఏదో సందర్భంలో పరోక్షంగా చేసిన విమర్శలను వైరల్ చేయడంలో ఫుల్ బిజీగా ఉంటున్నారట. ఇదంతా ఎందుకోసమనే చర్చ టీడీపీ వర్గాల్లో ఉంది. బలంగా ఉన్న పార్టీ బలహీనపడుతున్నా పట్టించుకోని నేతలు కుంపట్లు రాజేయడంతో తమ్ముళ్లు ఎటూ తేల్చుకోలేకపోతున్నారట.మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి నంద్యాల టీడీపీ ఇంచార్జ్. బ్రహ్మానందారెడ్డికి.. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఫరూక్ కుమారుడు ఫిరోజ్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. నంద్యాల టికెట్‌ను ఆశిస్తూ పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఫిరోజ్ వర్గం బ్రహ్మానందరెడ్డిపై ఒంటికాలిపై లేస్తోంది. ఫిరోజ్ యువసేన పేరుతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ టికెట్స్ అమ్ముకున్నారనే ఆరోపణలతో మాజీ ఎమ్మెల్యేపై నేరుగా బాణాలు ఎక్కు పెడుతున్నారు.బనగానపల్లి మాజీ ఎమ్మెల్యే ఏదో సందర్భంలో పరోక్షంగా బ్రహ్మానందరెడ్డిపై చేసిన విమర్శల వీడియోలు ఫిరోజ్ వర్గానికి ఇప్పుడు అస్త్రంగా మారిపోయాయి. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి.. టీడీపీ నేత నారా లోకేష్ పై చేసిన విమర్శలను బీసీ జనార్దన్ రెడ్డి ప్రస్తావిస్తూ.. బ్రహ్మానందరెడ్డి పై విమర్శలు చేశారట. పాలు అమ్ముకునే వారిని లోకేష్ ఎమ్మెల్యేని చేసారంటూ జనార్దన్ రెడ్డి గతంలో చేసిన కామెంట్స్ ప్రస్తుతం నంద్యాల టీడీపీలో రచ్చ అవుతున్నాయి. నంద్యాలలో టీడీపీకి ఈ పరిస్థితి రావడానికి ఇంఛార్జ్ బ్రహ్మానందరెడ్డే కారణమనేది ఫిరోజ్ వర్గం ఆరోపణ.కొంతకాలంగా నంద్యాలలో ఇరువర్గాలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. నియోజకవర్గం క్లస్టర్ మీటింగ్‌కు తనను పిలవలేదని బహిరంగ వేదికపైనే ఫిరోజ్.. బ్రహ్మానందరెడ్డిపై అసంతృప్తి వెళ్లగక్కారు. దాంతో తనను రాజకీయంగా కార్నర్ చేస్తున్న సొంత పార్టీ నేతలకు బ్రహ్మానందరెడ్డి కౌంటర్ ఇచ్చారు. పెద్దలు అందరిని కలుపుకొనే ముందుకు వెళ్తున్నానని.. తాను రాజకీయాల్లోకి రావాలని అనుకోలేదని వివరణ ఇచ్చారు మాజీ ఎమ్మెల్యే. అలాగే స్థానిక నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి వేదిస్తుంటే.. వారి కోసం వచ్చానని చెప్పుకొచ్చారు బ్రహ్మానందరెడ్డి. నంద్యాల టీడీపీలో విభేదాలు సృష్టించాలని ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ఎదుర్కొంటానని ఆయన తెలిపారు.రాష్ట్రంలో రాజకీయం హీట్ మీద ఉంది. ఆ ప్రభావం నంద్యాలలోనూ కనిపిస్తున్నా.. క్యాచ్ చేసుకునే పరిస్థితులో టీడీపీ నేతలు లేరు. పైగా ప్రత్యర్థులపై పోరాటం మానేసి సొంత వాళ్లపైనే ఓపెన్‌గా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం టీడీపీ నాయకులకే చెల్లిందని తమ్ముళ్లు గుర్రుగా ఉన్నారట. టికెట్ కావాలంటే పార్టీ పెద్దలను అడగాలి కానీ.. ఇలా రోడ్డున పడితే ఎలా అని ప్రశ్నిస్తున్నారట. మొత్తం మీద అధికారం కోల్పోయినా టీడీపీలో మార్పు రాదా అనే ప్రశ్న కేడర్‌లో వినిపిస్తోంది.

# మరమ్మత్తులు చేయండి...మహాప్రభో

విశాఖపట్టణం, ఆగస్టు 16,: ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కు ప్లాంటు పట్ల ఏళ్లతరబడి నిర్లక్ష్యం కొనసాగింది. సాంకేతిక పరమైన సమస్యలను పరిష్కరించడంలో జరిగిన అసాధారణ జాప్యం భారీ నష్టాలకు కారణమైంది. కాగ్ తాజాగా రూపొందించిన నివేదికలో ఈ విషయం స్పష్టమైంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక ప్రకారం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో నిర్లక్ష్యం ఖరీదు అక్షరాల 2,655 కోట్ల రూపాయలు. ఈ నివేదిక ప్రకారం కర్మాగారంలో ఉన్న రెరడు బ్లాస్ట్ ఫర్నేస్‌లను 14 నురచి 16 సంవత్సరాల మధ్యలో చేయాల్సిన మరమ్మతులకు తీవ్ర జాప్యం జరిగింది. సమస్యలు తలెత్తిన తరువాత ఒకదానిని 23 ఏళ్లకు, ఇంకోదానిని 24 ఏళ్లకు మరమ్మతులు చేశారు. ఈ జాప్యం వల్ల ఇనుమును కాల్చే గుండాలు చెడిపోయినట్లు తేలింది. ఇదే భారీ నష్టాలకు కారణమైందని కాగ్ పేర్కొంది. ఈ జాప్యం వల్ల 2011 నుంచి 2016 వరకు 1.78 మిలియన్ టన్నుల ఉత్పత్తి తగ్గిపోగా, దీని విలువ 1,396 కోట్ల రూపాయలుగా కాగ్ పేర్కొంది. అలాగే ప్రధాన ప్యాకేజి, ఆక్సిలరీ ప్యాకేజిల నిర్వహణలో కూడా లోపాల వల్ల మరిన్ని సమస్యలు ఉత్పన్నమైనట్లు గుర్తించారు. దీరతో నష్టం రూ. 1844 కోట్లకు చేరినట్లు తేలింది. ఉత్పత్తి కూడా 4.93 మిలియన్ టన్నులు తగ్గిపోయినట్లు గుర్తించారు. ఇదే సమయంలో ఇతర సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకోకపోవడం వల్ల 2.36 మిలియన్ టన్నుల ఉత్పత్తిపై ప్రభావం పడి, నష్టం రూ.2655 కోట్లకు చేరుకున్నట్లు కాగ్ తేల్చింది.

# ఇంకా ముంపులోనే గ్రామాలు

రాజమండ్రి, ఆగస్టు 16, గోదావరికి వరద ఉధృతి కొనసాగుతోంది. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద స్వల్పంగా తగ్గుముఖం పట్టినా ఇంకా ముంపులోనే పోలవరం ప్రాజెక్టు పరిధిలోని గ్రామాలు, లంకలు ఉన్నాయి. కాఫర్ డ్యాము వల్ల వరద వెంటనే తగ్గుముఖం పట్టడం లేదని విలీన గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలంలో శనివారం రాత్రి తొమ్మిది గంటలకు 50.70 అడుగుల నీటిమట్టం నమోదైంది. అక్కడి నుంచి దిగువకు 13.36 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం అప్పర్ స్పిల్ వే వద్ద 33.99 మీటర్లు, దిగువ స్పిల్ వే వద్ద 25.53 మీటర్ల నీటిమట్టం నమోదైంది. పోలవరం ప్రాజెక్టు నుంచి దిగువకు 11.79 లక్షల క్యూసెక్కుల నీటిని 15 గేట్ల ద్వారా విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద 14.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. 14.65 లక్షల క్యూసెక్కుల జలాలను 175 గేట్ల ద్వారా బ్యారేజీ నుంచి సుముద్రంలోకి విడుదల చేస్తున్నారు రెండ్రోజులతో పోల్చి చూస్తే భద్రాచలంలో 2.50 అడుగులకుపైగా, ధవళేశ్వరం వద్ద 0.5 అడుగుల నీటిమట్టం తగ్గింది. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద చోట్లా రెండో ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. రాజమండ్రిలోని రోడ్ కం రైలు వంతెన వద్ద గోదావరి ప్రవాహం ఉధృతంగా ఉంది. భద్రాచలంలో వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. అదే జరిగితే మళ్లీ గోదావరి పెరిగే అవకాశం పొంచి ఉంది. నెల రోజుల వ్యవధిలో గోదావరికి వరద రెండుసార్లు రావడంతో తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం నుంచి ఉమ్మడి గోదావరి జిల్లాలోని అంతర్వేది వరకూ ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.వరదలతో పోలవరం ప్రాజెక్టు పరిధిలోని విలీన మండలాల ప్రజలు విలవిల్లాడుతున్నారు. కాఫర్ డ్యాము వల్ల ఈ గ్రామాల్లో వరద తగ్గడం లేదు. గోదావరి, శబరి వరద ప్రారంభమై ఐదు రోజులు కావొస్తున్నా తగ్గుముఖం పట్టకపోవడంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పోలవరం నిర్వాసిత మండలాలైన చింతూరు, విఆర్.పురం, ఎటపాక, కూనవరం వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముంపులో ఉన్న తమ ఇళ్లు ఈసారి కచ్చితంగా పడిపోతాయని, ఇప్పటికే గోడలు నిమ్ము చేరి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాపర్ డ్యామ్ వల్ల ఎక్కువ రోజులు వరద వేధిస్తోందని, గతంలో ఇన్ని రోజులు వరద నీరు ఉండేది కాదని తెలిపారు. దీనికి ప్రభుత్వం పరిష్కార మార్గం చూపాలని కోరుతున్నారు. కొయ్యూరు, కల్లేరు, చుట్టూరు, నర్సింగపేట. ముకునూరు, ఎ.జి.కోడేరు, మల్లెతోట, వేగితోట, బండారి గూడెం, చెడుమూరు సహా వంద గ్రామాలు నేటికీ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. జాతీయ రహదారి ఇంకా వరద ముంపులోనే ఉండటంతో వందలాది వాహనాలు రోడ్లపై నిలిచిపోయాయి. ఈసారి వరద పోటుతో వందల ఎకరాల్లో జామాయిల్ తోటలు, వరి నాట్లు నీట మునిగాయని చింతూరు వాసులు తెలిపారు. పశువులకు మేత లేక గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ ఎండిన డొక్కలతో ఉన్నట్టు చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు కానరావడం లేదని, వీధులన్నీ దుర్గంధం వెదజల్లుతోందని, చీకటిపడితే దోమలతో సావాసం చేయాల్సి వస్తోందని తెలిపారు. శబరి నదికి భారీగా వరద నీరు చేరడం, పోలవరం ప్రాజెక్టు వద్ద నిర్మించిన కాపర్ డ్యామ్ ప్రభావంతో పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలంలోని రహదారులపైకి చేరిన వరద ఏ మాత్రమూ తగ్గడం లేదు. వింజరం–చీరవల్లి వద్ద ప్రధాన రహదారిని వరద ముంచెత్తడంతో ఎగువన ఉన్న 20 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చే అవకాశం లేకుండాపోయింది. వేలేరుపాడు మండలంలో ఏడు గ్రామాల్లోని రహదారులు జలదిగ్బంధంలోనే ఉన్నాయి.కృష్ణా నదికి వరద కొనసాగుతోంది. నాగార్జున సాగర్‌కు ఎగువ నుంచి 4.09 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలకు 3.77 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా, ప్రకాశం బ్యారేజీకి 3.40 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 3.53 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువన పలు గ్రామాల్లోని లంకల్లోకి వరద నీరు కొనసాగుతోంది. వరద ఉధృతి కొంతతగ్గినా, ఇప్పటికీ వరద ముప్పు పొంచి ఉంది. ఎగువ నుంచి వరద నీరు పోటెత్తడంతో శ్రీశైలం జలాశయం పది గేట్లను 15 అడుగుల మేర ఎత్తి 3,76,170 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ జలాశయ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత 884.30 అడుగులకు చేరింది. ఈ జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 215.807 టిఎంసిలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 211.4759 టిఎంసిలుగా నమోదైందివశిష్ట గోదావరి పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలి, ఆచంట మండలాల్లోని లంకలను ముంచెత్తుతోంది. ఆచంట మండలంలోని లంక గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. అయోధ్యలంక, పుచ్చల్లంక, భీమలాపురం శివారు కాపులపాలెంలో లోతట్టు ప్రాంతాలతోపాటు ఆవాసాలనూ వరద నీరు చుట్టుముట్టింది. భీమలాపురం శివారు కాపులపాలెంలో దిగువన ఉన్న కాజ్ వే పైనుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తుండడంతో దాదాపు వంద కుటుంబాలు వరద బారిన పడ్డాయి. కొబ్బరి తోటల్లో భారీగా వరద నీరు చేరింది. పలు ఇళ్లు చుట్టూ నీరు చేరడంతో డాబాలపై ఇంటి సామగ్రిని చేర్చుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. యలమంచిలి మండలం కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, బాడవ, యలమంచిలిలంక గ్రామాల్లోకి వరద నీరు చేరింది. దీంతో, ఆయా గ్రామాల ప్రజలు ప్రధానంగా తాగునీటికి అల్లాడుతున్నారు. ధవళేశ్వరం వద్ద ఉధృతి కొనసాగడంతో కోనసీమ జిల్లాలో ఇప్పటికే ఎనిమిది, తూర్పుగోదావరి జిల్లాలో మూడు లంక గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకోవడంతో రాకపోకలు స్తంభించాయి. ధవళేశ్వరం వద్ద ఉధృతి కొనసాగుతుండడంతో కోనసీమ జిల్లాలోని లంకలపై వరద ప్రభావం కొనసాగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# ప్రకాశం గ్రామాల్లో కానరాని అభివృద్ధి

ఒంగోలు, ఆగస్టు 16,ఉప్పు సత్యాగ్రహ ఉద్యమానికి మేము సైతం అంటూ కదిలిందా గ్రామం. గాంధీజీ పిలుపునందుకుని ఉద్యమించింది. ఆ గ్రామస్తుల స్ఫూర్తిని చూసి దేవరంపాడును పర్యాటక కేంద్రంగా మార్చుతామని హామీ ఇచ్చారు ఆనాటి పాలకులు. 75 ఏళ్లు అవుతున్నా నేటికీ ఆ కల నెరవేరలేదు. కనీసం 75 ఏళ్ల స్వాతంత్ర్య ఉద్యమ సందర్భంగా అయినా తమ ఊరును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. మువ్వన్నెల జెండా రెపరెపలాడుతూ దేశవ్యాప్తంగా సాగుతన్న ఆజాదీ క అమృత్ మహోత్సవాల సంబురాలు ఓవైపు. ఈ ఉత్సవాలకు గుర్తుగా నిలిచిన ఎందరో మహానుభావుల త్యాగాలు మరోవైపు. ప్రకాశం జిల్లాకు చెందిన చాలా మంది స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములయ్యారు. మహాత్మాగాంధీ పిలుపునందుకుని.. సైమన్ గో బ్యాక్ అన్న నినాదంతో బ్రిటీష్ పోలీసుల తుపాకులకు ఎదురెళ్లారు.ఎందరో త్యాగధనుల చిరస్మరణీయమైన జ్ఞాపకాలున్నప్పటికీ అందులో ప్రధానంగా చెప్పుకోదగ్గ వారు ప్రకాశంపంతులు. ఆయన స్వగ్రామం అయిన దేవరంపాడులో ఉప్పుసత్యాగ్రహం నిర్వహించారు. దండి తర్వాత దక్షిణ భారతదేశంలో దేవరంపాడులోనే ఉప్పుసత్యాగ్రహం సాగింది. అలాంటి చార్మిత్మాకమైన ప్రాంతమైన దేవరంపాడు, వినోదరాయునిపాలెం గ్రామాలను అభివృద్ధి చేసి, పర్యాటకంగా తీర్చిదిద్దుతామని ఆనాటి పాలకులు అభయం ఇచ్చారు.తెల్లోడి తుపాకీకి ఎదురు తిరిగిన ధీశాలి టంగుటూరి ప్రకాశం పతులు. ఆయన పెరెత్తగానే తెలుగోడి హృదయం ఉప్పొంగుతుంది. ఆయన గొప్పతనానికి ఆంధ్ర కేసరి అన్న బిరుదును ఇచ్చారు ప్రజలు. ఆయన సేవలకు గుర్తుగా ఒంగోలు జిల్లాను ప్రకాశం జిల్లాగా నామకరణం చేశారు.స్వాతంత్ర్య ఉత్సవాల సందర్భంగా ప్రతీ సారీ గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం తప్ప ఇప్పటి వరకు ఊరికి పెద్దగా చేసిందేమీ లేదు. ప్రకాశం పంతులుకు ఇక్కడి రాజుల కుటుంబానికి చెందిన వారు అప్పట్లో మామిడి తోటలు రాసిచ్చారు. ఆయన చివరి మజిలీ ఎక్కువగా తనకిష్టమైన విజయస్థూపం దగ్గరే సాగింది. ప్రకాశం పంతులు స్మృతి చిహ్నాం ఏర్పాటుచేసి పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న గ్రామస్తుల ఆకాంక్ష.. దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ నెరవేరలేదు.ప్రకాశం పంతులు 1872 వినోదరాయునిపాలెంలో జన్మించారు. న్యాయవాద వృత్తిలో నాటి సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ఉద్యమించారు. అప్పుడాయనకు ఎన్నో బెదిరింపులు వచ్చాయి. ఆయనా వాటిని లెక్కచేయలేదు. టంగుటూరి జీవితం తెరిచిన పుస్తకం. ఆయన విద్యాభ్యాసం, రాజకీయం స్వాంతత్ర్య పోరాటం అన్నీ నేటికీ గుర్తుచేసుకుంటూనే ఉంటారు. రాజకీయాల్లోనూ చెరగని ముద్ర వేసుకున్నారు. అవన్నీ ఆయన వ్యక్తిత్వానికి, ఆత్మస్థైర్యానికి ప ?రతీకలు. ఇప్పటికీ ఆయన వారసులు ఒంగోలులో ఉంటున్నారు. వారి తాత చేసిన త్యాగాలను గుర్తుచేసుకుంటూనే ఉంటారు.స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాదు.. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన టంగుటూరి ప్రకాశం పంతులు పుట్టిన ఊరును సందర్శించిన అధికారులు కూడా గ్రామాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేలా చూస్తామని హామీ ఇస్తున్నారు.ఇప్పటికైనా టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవను గుర్తించి.. ఆయన పుట్టి పెరిగిన గ్రామాలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. పంతులు లాంటి మహానుభావుల గురించి భవిష్యత్ తరాలకు తెలిసేలా చేసినప్పుడే వారి త్యాగాలను అర్థం ఉంటుందన్న సంగతిని పాలకులు గుర్తుంచుకోవాలి.

# ఆగస్టు 23వ తేదీన జరగబోయే విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయండి

**విద్యార్థి సంఘాలు**

బద్వేలు బద్వేల్ పట్టణంలో ఉన్న ఎస్సీ వన్ బాయ్స్ హాస్టల్ లో విద్యాసంస్థల బంద్ పోస్టర్లను విడుదల చేయడం జరిగినది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ కుమార్ బద్వేల్ ఏరియా కార్యదర్శి ఎం అశోక్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను క్రింది స్థాయి నుండి పై స్థాయి వరకు పూర్తిగా అటకెక్కించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యార్థుల మెదడులోకి మతోన్మాదాన్ని ప్రేయరోపితం చేయడానికి కంకణం కట్టుకుందన్నారు.బిజెపి రాష్ట్ర పాలిత ప్రాంతంలో కూడా అమలు చేయనటువంటి నూతన జాతీయ విద్యా విధానాన్ని కేంద్రంలో ఉన్న మోడీ సాబ్ పై మక్కువతో స్వామి భక్తిని ప్రదర్శించుకుంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడానికి తీసుకొచ్చిన జీవో నెంబర్ 117 ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నటువంటి 3,4,5 తరగతి చదివే విద్యార్థులను హైస్కూలలో విలీనం చేస్తూ విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షాలా చేస్తున్నారన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు మూడు నెలలు కావస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చెప్పినటువంటి విద్యా కానుక సంక్షేమ పథకం ద్వారా రావలసిన పాఠ్యపుస్తకాలు,యూనిఫామ్, షూ, బెల్ట్ బ్యాగులు రాకపోవడం సిగ్గుచేటు అన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించకుండా నాశీకరమైన భోజనాన్ని అందిస్తూ విద్యార్థులను ఖాళీ కడుపులతో పాఠశాలలకు వెళ్లే దుస్థితి ఏర్పడిందన్నారు. నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరుగుతున్న హాస్టల్స్ లో విద్యార్థులకు ఇచ్చే కాస్మోటిక్ ఛార్జీలు ఎందుకు పెంచడం లేదని వారు ప్రశ్నించారు. (పీ.జీ) లాంటి ఉన్నత చదువులు దూరం చేసే విధంగా ఉన్నటువంటి జీవో నెంబర్ 77 ను రద్దు చేయాలని వారు వెల్లడించారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలు రంగురంగుల కరపత్రాలను తయారు చేసుకుని విద్యార్థి తల్లిదండ్రులను మోసం చేస్తూ వేలాది రూపాయలు ఫీజులను దొండుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు విద్యను బోధించడానికి ఉపాధ్యాయులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదలు చేస్తానన్న డీఎస్సీ నోటిఫికేషన్లు ఎక్కడ అని వారు ప్రశ్నించారు. విద్యార్థులు విద్యను అభ్యసించడానికి దూర ప్రాంతాల నుండి పట్టణాలకు చదువుకోవాలని ఆకాంక్షతో వచ్చే విద్యార్థుల నుండి బస్సు పాస్ చార్జీలను పెంచి విద్యార్థులు విద్యను అందనివ్వకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆటంకాలు కలిగిస్తుందన్నారు. ఇలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు విధించే ప్రమాణాలు బడుగు బలహీన వర్గ విద్యార్థులకు విద్య దూరం అయ్యే పరిస్థితి ఉందని అందుకోసమే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల బంద్ కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ యొక్క బంద్ ను ప్రతి విద్యార్థి ప్రతి ఒక్క విద్య వ్యవస్థ స్వచ్ఛందంగా విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమానికి విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ పట్టణ సహాయ కార్యదర్శి భాష పట్టణ ఉపాధ్యక్షుడు తేజ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మళ్లీ ఢిల్లీకి చంద్రబాబు



విజయవాడ, ఆగస్టు 16, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఢిల్లీ పయనమవుతున్నారు. ఆయన వచ్చే వారంలో ఢిల్లీకి వెళుతున్నట్లు సమాచారం. ఢిల్లీకి దూరమవ్వడంతో చంద్రబాబు రాజకీయంగా చాలా కోల్పోయానని ఫీలవుతున్నారు. ఒకప్పుడు చంద్రబాబు ఢిల్లీలో అడుగుపెడుతున్నారంటే ఇతర పార్టీల నేతలు ఎదురు చూసేవారు. కానీ ఇప్పుడా పరిస్థి?తి లేదు. ఇటు అధికార బీజేపీ, అటు విపక్ష యూపీఏ నేతలు కూడా చంద్రబాబును పెద్దగా పట్టించుకోవడం లేదు. కలిసినప్పుడు పలకరింపులే కాని చంద్రబాబు అంటూ ఒకరున్నారన్న విషయాన్ని కూడా వారు గుర్తుంచుకోవడం లేదు... ఇటీవల మమత బెనర్జీ రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశానికి చంద్రబాబుకు పిలుపు లేదు. ఆయన మోదీకి మద్దతుగా ఉన్నాడని అనుకున్నా, జగన్ కు రాసిన లేఖ చంద్రబాబుకు రాయకపోవడం కొంత వాల్యూను తగ్గించడమే అవుతుంది. ఇక 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తో జతకట్టి, ఢిల్లీలో రాహుల్ తో కలసి నడిచిన చంద్రబాబుకు ఆ పార్టీ నుంచి కూడా పిలుపులు లేవు. అంటే చంద్రబాబును ఏ పార్టీ నమ్మే పరిస్థితి ఢిల్లీలో కనిపించడం లేదు. ఇది ఒకరకంగా ఆయన స్వయంకృతాపరాధమేనని చెప్పాలి. రెండుసార్లు వరసగా ఓడిపోయిన అఖిలేష్ యాదవ్ కు ఇచ్చిన విలువ కూడా పథ్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబుకు లేకుండా పోయింది.అయితే ఇటీవల ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా ప్రధాని మోదీతో కరచాలనం చేసిన తర్వాత మళ్లీ చంద్రబాబులో ఆశలు చిగురించాయి. బీజేపీతో మరోసారి సయోధ్యతతో కొనసాగేందుకు ఢిల్లీకి వెళుతున్నారు. మోదీ, అమిత్ షా అపాయింట్ మెంట్ ల కోసం ప్రయత్నిస్తున్నారు. ఎప్పుడైనా రావచ్చు అన్న మోదీ పిలుపును పురస్కరించుకుని వచ్చే వారంలో చంద్రబాబు హస్తిన పర్యటనకు రెడీ అవుతున్నట్లు సమాచారం. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ ప్రభుత్వాన్ని ఎదుర్కొనాలంటే కేంద్ర ప్రభుత్వం మద్దతు ఆయనకు అత్యవసరం. అది ఉంటేనే క్యాడర్ నుంచి నేతల వరకూ పరుగులు పెడతారన్న అంచనాలో ఉన్నారు. అందుకే చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి మరీ జగన్ ప్రభుత్వంపై ఫిర్యాదులు చేయాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. టీడీపీ నేతలపై అక్రమ కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించడం, దాడులకు పాల్పడటం, కేంద్ర ప్రభుత్వ పథకాలను తాను ఇస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం, విపరీతమైన అప్పులు చేయడం, ఉచిత పథకాల వంటివి మోదీ దృష్టికి తేవాలనుకుంటున్నారు. అందుకోసం ఆయన ప్రిపేర్ అవుతున్నట్లు చెబుతున్నారు. ఈ నెలలోనే చంద్రబాబు హస్తిన పర్యటన ఉండే అవకాశాలున్నాయన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. మోదీతో మీట్ అయితే మాత్రం ఏపీ రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకునే అవకాశముందన్నది విశ్లేషకుల అంచనా.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమల తిరుమలలో యధాతథంగా మంగళశారం కుడా భక్తుల రద్దీ కొనసాగింది. తిరుమలకు వచ్చే భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సర్వదర్శనానికి 24 గంటలు సమయం పడుతుంది. పిల్లలకు, ఉద్యోగస్తులకు సెలవులు రావడంతో జనసంద్రంగా మారిన తిరుమల రూ. 300/- దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతుంది. సర్వదర్శనంకు వైకుంఠ క్యు కాంప్లెక్స్ 1 మరియు 2 కంపార్ట్మెంట్ లలో భక్తులు నిండి ఉన్నారు. వరాహ స్వామి గెస్ట్ హౌస్ నుంచి వైకుంఠ క్యూ కాంప్లెక్స్ వరకు లైన్ లో భక్తులు నిండి ఉన్నారు. కనుక టీటీడీ ఛైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి ఈనెల 21వ తేదీ వరకు బ్రేక్ దర్శనం రద్దు చేస్తున్నట్లు, వికలాంగులు,చంటి పిల్లలు, వయోవృద్ధులు ప్రత్యేక క్యూ లైన్ ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. సిఆర్ఓ ఆఫీస్ గదుల కేటాయింపు కోసం భక్తులు లైన్లో వేచి ఉన్నారు. కొంతమంది భక్తులకు అద్దె గదులు దొరకక నానాఅవస్తలు పడుతన్నారు.

# సర్పంచ్ సొంతఖర్చులో రహదారి మరమత్తులు

ఏలూరు ఏలూరు నుండి బాధరాల మీదగా రంగాపురం వెళ్లే ప్రధాన రహదారి రామసింగవరం దాటి బాధరాల పంచాయతి బోర్డర్ లో రహదారి పూర్తిగా గోతులు మయమై నడవడానికి, వాహనాలు వెళ్లే పరిస్తితికూడా లేనివిధం గా తయారైంది. బాధరాల పంచాయతీ ఆదాయ వనరులు లేని పంచాయతీ. దీంతో ఆ రహదారుల శాఖ చేపడుతుందని ఎన్నో ఏళ్లుగా చూసినా ఎదురు చూపు ఎండమావిగా మారింది. బాధరాల త సర్పంచ్ బొల్లినేని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ తా తా కోటేశ్వరరావు ప్రయాణికుల అవస్థలు,విమర్శలు పై స్పందించారు. మంగళ వారం ఉదయం సర్పంచ్ స్వంత వ్యయంతో జె సి బి ని రప్పించి దీర్ఘ కాలంగా గోతులుగా మారి చెరువుగా తయారైన రహదారి డి మరమ్మత్తులు చేయించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ రహదారి అభివృద్ధికి నిధులు కేటాయించి రహదారి నిర్మాణం చేపట్టాలని బాధరాల ప్రజలు కోరుతున్నారు

# రామకోనేరుకు మహర్దశ

విజయనగరం, ఆగస్టు 16, పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి ఆలయం పక్కనున్న రామకోనేరుకు మహర్దశ కలగనుంది. కోనేరు అభివృద్ధి పనులకు దేవదాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అమృత సరోవర్ కార్యక్రమంలో భాగంగా కోనేరును బాగుచేసేందుకు రూ.1.50 కోట్ల వ్యయంతో దేవదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు ఉపాధిహామీ సిబ్బంది రామకోనేరుకు జియో ట్యాగింగ్ పూర్తి చేశారు. జలవనరుల శాఖ అధికారులు కోనేరుకు కొలతలు వేసి అభివృద్ధి పనులపై అంచనాలు రూపొందించే పనిలో నిమఘ్నమయ్యారు. రామకోనేరు 12 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. రామక్షేత్రానికి విచ్చేసే భక్తులు ముందుగా కోనేరులో పుణ్య స్నానమాచరించిన తరువాత సీతారామస్వామిని, ఉమా సదాశివుడిని దర్శించుకుంటారు. ప్రస్తుతం రామకోనేరులో రెండు పుష్కర ఘాట్‌లు ఉన్నాయి.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన ఆలయాల కోనేరుల అభివృద్ధిలో భాగంగా ఆ శాఖ అధికారులు తాజాగా అమృత సరోవర్ పథకం కింద రామతీర్థం కోనేరును ఎంపిక చేశారు. పనులు పూర్తయితే రామక్షేత్రానికి మరింతి శోభ సాక్షాత్కరించనుంది. రామకోనేరులోకి నీరు వచ్చి పోయేందుకు ఇన్‌లెట్, ఔట్‌లెట్ నిర్మాణాలు పూర్తి చేస్తారు. కోనేరు చుట్టూ ఉన్న గట్టును మరింత పటిష్టం చేయనున్నారు. కోనేరులో పూడికతీత పనులు, చుట్టూ రాతి కట్ట నిర్మాణాలు, పడమర వైపు సువిశాలంగా పుష్కర ఘాట్ నిర్మాణం, భక్తుల సౌకర్యార్థం పుష్కరఘాట్‌ల వద్ద అదనపు షెడ్‌ల నిర్మాణం, మూడు అడుగుల ఎత్తులో గట్టు, రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు పూర్తిచేస్తారు. వీటితో పాటూ 100 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో కూడిన సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కోనేరు అభివృద్ధి పనులకు సుమారు రూ.3 కోట్లు అవసరమవుతాయని దేవస్థాన ఈఓ ప్రసాదరావు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# పోలీసులమని బెదిరించి యువతిపై అత్యాచారం

మచిలీపట్నం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో దారుణం ఘటన జరిగింది. ఓ యువతిని బలంవంతగా ఎత్తుకెళ్లిన యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. తరువాత యువతి న్యూడ్ వీడియోలు తీసి బెదిరింపులకు పాల్పడ్డారు.అయితే, సంఘటన అలస్యంగా వెలుగులోకి వచ్చింది. మచిలీపట్నానికి చెందిన ఓ యువతి ఇటీవల రాత్రి సమయంలో పనిముగించుకొని ఇంటికి వెళ్తోంది. ఆ సమయంలో బైక్ పై వచ్చిన యువకులు పోలీసులమని చెప్పి బలవంతంగా బైక్ ఎక్కించుకుని తీసుకెళ్లారు.స్థానికంగా ఉన్న చిలకలపూడి రైల్వే స్టేషన్ వెనక ఖాళీ స్థలంలోకి యువతిని తీసుకెళ్లి అత్యాచారం చేశారు. యువతిపై దారుణానికి పాల్పడి న్యూడ్ వీడియోలు తీశారు. యువతి ఫోన్ కూడా లాక్కున్నారు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే న్యూడ్ వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో పెడతామని యువతిని బెదిరించారు. ఘటన జరిగిన తర్వాత రోజు తనపై అఘాయిత్యానికి పాల్పడిన వారిలో ఓ యువకుడు తన ఇంటి ముందు నుంచే వెళ్తుండటాన్ని బాధితురాలు గుర్తించింది. వెంటనే బంధువుల సాయంతో ఆ యువకుడ్ని పట్టుకుంది. పోలీసులు రంగప్రవేశం చేసారు. నిందితుడు సుకర్లాబాద్ చెందిన నారాయణగా గుర్తించారు. అతడిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక రెండవ నిందితుడికోసాం పోలీసులు గాలింపు ప్రారంభించారు. అదుపులో వున్న నిందితుడినుంచి యువతి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఫార్మాసిస్టులకు సర్కారీ ట్రైనింగ్

హైదరాబాద్, ఆగస్టు 16, (న్యూస్ పల్స్)రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ దవాఖాన్లలోని ఫార్మసిస్టులకు ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి టీచింగ్?ఆసుపత్రుల్లోని ఫార్మసీల్లో పనిచేసే స్టాఫ్?అందరికీ శిక్షణ ఇవ్వనున్నారు. వివిధ రకాల రోగాలు, వాటిని సమర్థవంతంగా పనిచేసే మెడిసిన్స్, డాక్టర్లు రాస్తున్న అప్?డేటెడ్?మెడిసిన్స్‌పై అవగాహన కల్పించనున్నారు. బ్రాండ్, ఫార్ములాలపై కూడా క్లాస్‌లు నిర్వహించనున్నారు. సీనియర్?డాక్టర్లు, ఫార్మకాలజిస్టులతో ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఇప్పటికే తొలి విడత కొంత మంది సీనియర్?ఫార్మసిస్టులకు శిక్షణ ఇచ్చారు. త్వరలో అన్ని దవాఖాన్లలోని ఫార్మసిస్టులకు మెడిసిన్స్‌పై అవగాహన కల్పించనున్నారు. ఈ మేరకు మంత్రి హరీశ్?రావు కూడా ఆఫీసర్లకు ఆదేశాలిచ్చారు.రాష్ట్ర వ్యాప్తంగా సుమారు పది వేల మందికి పైగా ఫార్మసిస్టులు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వీరిలో రెగ్యులర్‌తో పాటు అవుట్?సోర్సింగ్, కాంట్రాక్ట్?స్టాఫ్?కూడా ఉన్నారు. వీళ్లందరికీ ఇప్పుడు బ్యాచ్‌ల వారీగా శిక్షణలు ఇవ్వనున్నారు.

# అభివృద్ధికి ఆద్యుడు కోట్ల-- ఘనంగా కోట్ల విజయ భాస్కర రెడ్డి 102 వ జయంతి



ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు పట్టణంలో దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర రెడ్డి 102 వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు కోట్ల విజయ భాస్కర రెడ్డి చిత్ర పటమునకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంను రెండు కళ్లుగా భావించి ప్రగతి పథంలో ఎన్నో మైలురాళ్లు సాధించి... పల్లె పల్లెకు తాగునీరు- సాగునీరు అందించడమే కాకుండా రోడ్లు, గృహాలు, విద్య, వైద్య, ఆరోగ్యం ప్రాధాన్యత ఇచ్చి రైతులకు భూమి హక్కు పత్రములను ఇచ్చిన ముఖ్యమంత్రి భారతదేశంలోనే కోట్ల విజయభాస్కరరెడ్డి మొదటి వ్యక్తి అని తెలిపారు. పేదలకు రూ.1.90 పైసలకే కిలో బియ్యం పథకం, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ప్రవేశపెట్టి న ఘనత కోట్ల దేనన్నారు. రైతులకు రూ.50/- లకే విద్యుత్ సరఫరా అందించడమే కాకుండా, బడుగు, బలహీన వర్గాలకు శాశ్వత గృహ నిర్మాణాలు చేపట్టి, మహిళలకే రేషన్ షాపులు కేటాయిస్తూ... వారి ఆత్మ గౌరవం కోసం ఏకంగా సారాను నిషేధించి, డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక సాధికారతకు కృషి చేశారన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు, కె.సి. కెనాల్,ఎల్.ఎల్.సి. ఆధునీకరణ పనులకు వందల కోట్ల రూపాయలు మంజూరు చేయించారని తెలిపారు. 2 సార్లు జిల్లా పరిషత్ ఛైర్మన్ గా,5 సార్లు శాసన సభ్యులుగా, ఒక సారి శాసనమండలి సభ్యులుగా,6 సార్లు కర్నూల్ లోకసభ సభ్యుడు గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు 2 సార్లు ముఖ్యమంత్రిగా,4 సార్లు కేంద్రమంత్రిగా సేవలు అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. 1954,1955,1983 లలో ఎమ్మిగనూరు నియోజకవర్గం నుండి మూడు సార్లు శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహించి ఎమ్మిగనూరు తో విడదీయరాని బంధం ఏర్పరుచుకున్నాడన్నారు.×" పెద్దాయన "జీవిత చరిత్ర పుస్తకం దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర రెడ్డి గారి జీవిత చరిత్రను "పెద్దాయన" పేరుతో కదిరికోట ఆదెన్న రచనలో రూపొందిస్తున్నట్లు కోట్ల క్యాంప్ ఆఫీస్ వెల్లడించింది.

ఈ కార్యక్రమంలో... మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ మల్కాపురం నాగిరెడ్డి, బనవాసి ఆదినారాయణ రెడ్డి, కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి. అల్తాఫ్, ఆం.ప్ర. రాష్ట్ర సగర (ఉప్పర ) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, అడ్వకేట్ కే.టి. మల్లికార్జున, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మాచాని శివకుమార్, బూదూరు రాఘవేంద్రరెడ్డి, యన్. సురేష్ కుమార్, ఎమ్మిగనూరు మండలం మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, కడివెల్ల మాజీ ఎంపీటీసీ పి.బి. లింగన్న, ఎరుకల మారెన్న, మేకల కర్రెన్న, వెంకటాపురం బుడ్డన్న, నాగరాజు, ముస్లిం మైనార్టీ నాయకులు కె.యం.డి. జబ్బార్, పీర్ బాషా, మహబూబ్ బాషా, ఆఫ్గన్ వల్లి భాష, టౌన్ ఎస్సీ సెల్ నాయకులు రోజా ఆర్ట్స్ ఉసేని, సప్లయర్ బంగారప్ప, దర్జీ మోషన్న, కంపాడు చిన్న రంగన్న, అల్వాల ప్రసాద్, యస్. సాల్మన్, జాలవాడి ఏసన్న, ఎమ్మిగనూరు మండలం నాయకులు మాచుమాన్ దొడ్డి శ్రీనివాసులు, పార్లపల్లి పాపారాయుడు, గుడికల్ కొలంట్ల నాగరాజు, కె. తిమ్మాపురం సోమప్ప, కందనాతి గ్రామం లక్ష్మణ స్వామి, బిక్కి రాముడు గోనెగండ్ల మండలం నాయకులు పెద్ద మరి వీడు గ్రామ మాజీ సర్పంచ్ దస్తగిరి, గోనెగండ్ల మాబు వలి, నందవరం మండలం నాయకులు రాయచోటి మారెప్ప,లోకయ్య, ఇశ్రాయేలు, కనకవీడు పెద్దఈరన్న, కోసిగి మండల నాయకులు కోసిగియ్య, కోట్ల క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ లు కె. శంకరన్న, యన్. ఆదెన్న, టిడిపి సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ ముని స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మధురానగర్ చౌరస్తాలో నిర్వహించిన సామూహిక జాతీయ గీతాలాపన

చొప్పదండి 75వ భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగంగా దేశ సమైక్యతను దేశభక్తిని దశ దిశల చాటి చెప్పడానికి స్వాతంత్ర్య సమరయోధుల స్మరించుకోవడానికి దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమం పురస్కరించుకొనికరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధుర నగర్ చౌరస్తాలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు అధికారులు విద్యార్థులు వివిధ పాఠశాల ఉపాధ్యాయులు యువకులు మహిళలు మహిళా సంఘాల నాయకులు పలు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తూ జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా సురభి విద్యానికేతన్, శ్రీ వివేకానంద విద్యాలయం, తేజస్విని జూనియర్ కళాశాల, పలు ప్రైవేటు పాఠశాల విద్యార్థనీ విద్యార్థులు జాతీయ జెండాను ర్యాలీగా నిర్వహిస్తూ పట్టుకొని మధుర నగర్ చౌరస్తా వరకు వచ్చి జాతీయ గీతాలాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీరామ్ మధుకర్, తహసిల్దార్ శ్రీనివాస్ గౌడ్, ఎం పి డీ వో, ఎస్సై రాజు పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు పోలీస్ సిబ్బంది గ్రామస్తులు తదితర మహిళా సంఘాల నాయకులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పేయి సేవలు చిరస్మరణీయం

**-బీజేపీ రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునిల్ రెడ్డి**

మంథని భారతదేశ మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారి వాజ్ పేయి సేవలు చీరస్మరణీయం అని బీజేపీ రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునిల్ రెడ్డి అన్నారు. పె మంథని బీజేపీ కార్యక్రమంలో మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారి వాజ్ పేయి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సునిల్ రెడ్డి మాట్లాడుతూ ఐ.రా.స సభలో హిందీ లో ప్రసంగించిన తొలి వ్యక్తిగా గుర్తింపు పొందాడని, బీజేపీ పార్టీ తొలి అధ్యక్షులుగా ఎన్నిక అయ్యాడని, 1998-2004 వరకు పూర్తి కాలం కాంగ్రెస్సేతర ప్రధాని రికార్డు సృష్టించారని కొనియాడారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు వేల్పుల రాజు, పట్టణ అధ్యక్షులు ఎడ్ల సదశివ్, మండల ఇంచార్జి చిలువేరి సతీష్,మండల ప్రధాన కార్యదర్శులు తోట మధుకర్, విరబోయిన రాజేందర్,పట్టణ ప్రధాన కార్యదర్శులు సబ్బాని సంతోష్, పబ్బ తిరుపతి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి బోయిని నారాయణ,సీనియర్ నాయకులు నాంపల్లి రమేష్, కోరబోయిన మల్లికార్జున్,పోతారవేణి క్రాంతికుమార్, రేపాక శంకర్, పట్టణ కార్యదర్శి ఎడ్ల సాగర్ , పట్టణ ఉప అధ్యక్షులు దాసరి శ్రవణ్, ఎస్ సీ మోర్చా పట్టణ అధ్యక్షులు కాసర్ల సూర్య, పుప్పాల దేవేందర్, అయింటి మల్లేష్, పార్వతి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# చలో పొద్దుటూరు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

బద్వేలు కడప జిల్లా సమగ్ర అభివృద్ధి కొరకు జరుగుతున్న సిపిఐ కడప జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఏరియా కార్యవర్గ సభ్యుడు పి. వెంకటరమణ గోపవరం మండల కార్యదర్శి జి. పెంచలయ్య పేర్కొన్నారు. మంగళవారం నాడు సిపిఐ గోపవరం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రాజెక్టు సెకండ్ కాలనీలో సిపిఐ జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలో పెద్దన్నలాంటి సిపిఐ మహాసభలు అతి వైభవంగా, భారీ ప్రదర్శనలతో పొద్దుటూరులో జరగనున్నాయని, మహాసభలలో జిల్లా లో ప్రతి ఒక్క కుటుంబానికి మూడు ఎకరాలు సాగు భూమి ,ఇళ్ల స్థలాలు ,ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం సోమశిల వెనుక జలాల ఎత్తిపోతల పథకం తదితర సమస్యల పరిష్కారం కోసం చర్చ జరిపి రాబోయే కాలంలో ప్రజా ఉద్యమాలు ముమ్మరం చేస్తామని వారు అన్నారు. కావున మండలంలోని ప్రజలంతా ఊరుకో బండి, ఇంటికోమనిషి కదలివచ్చి మహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయక కార్యదర్శి ప్రభాకర్, ప్రజానాట్యమండలి బద్వేల్ పట్టణ అధ్యక్షుడు ఎస్ చెన్నయ్య, అశోక్ ,దివాకర్ మల్లీ ,పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల కాపరులకు రూ .11 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని నంద్యాల జాయింట్ కలెక్టర్కు వినతిపత్రం.....




నంద్యాల జిల్లా కు చెందిన బడా బీరయ్య ,వెంకటేశ్వర్లు కు చెందిన సుమారు 70 గొర్రెల మృత్యువాత అలాగే 20 గొర్రెలు పాక్షికంగా దెబ్బతినడం జరిగింది. ఈ ఘటన గుంటూరు నుంచి డోన్ వైపు వెళ్తున్న ఎక్స్ప్రెస్ రైలు కిందపడి గొర్రెలు మృతి చెందడంతో గొర్రెల కాపరులు సుమారు 11 లక్షలు నష్టం వాటిల్లింది.. కావున వైయస్సార్ పశువుల బీమా కింద ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిందిగా నంద్యాల జాయింట్ కలెక్టర్ వినతి పత్రం అందజేసిన వారిలో కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు కత్తి శంకర్ శంకర్, డిమాండ్ చేశారు. మా కులవృత్తి గొర్రెలు పెంపకం , మాకు గొర్రెల జీవనాధారం కాబట్టి మా గొర్రెల కాపరుల విషయంలో గవర్నమెంట్ నుంచి ఎలాంటి ఇబ్బంది లేకుండా మా వారికి గొర్రెల బీమా ఇప్పించాల్సిందిగా కోరుచున్నాము. నంద్యాల జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ భూములను కొంతమంది అధికారులతో కుమ్మక్కై సాగులోకి తీసుకొని డి పట్టాలు పొందే ప్రయత్నం చేస్తున్నారు గొర్రెలు మేపుకునేందుకు లేకుండా మమ్మల్ని చాలా ఇబ్బందులు గురి చేస్తున్నారు. దీని విషయమై నంద్యాల జాయింట్ కలెక్టర్ శ్రద్ధ వహించి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని వారు కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ను కలిసిన వారు బి . బీరయ్య, వేంకటేశ్వర్లు,బి .బాలరాజు తదితరులు పాల్గొన్నారు

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు పట్టణంలోనిరుద్యోగ యువతీ యువకులకు బహుళజాతి బ్యాంకు నందు రిలేషన్ షిప్ మేనేజర్ గా పని చేయుటకు గాను సిద్దార్థ డిగ్రీ కాలేజి, యమ్మిగనూరు వారి అధ్వర్యంలో జిల్లాలో ఉన్న నిరుద్యోద యువతీ యువకులకు సిద్దార్థ డిగ్రీ కాలేజి, యమ్మిగనూరు నందు 17.08.2022 వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించడం జరుగుతుందని,ఈ ఉద్యోగమేళ 17.08.2022 వ తేదీన ప్రముఖ బ్యాంకు అయిన ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకు నందు రిలేషన్షిప్ మేనేజర్ గా పనిచేయటానికి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని,దీనికి ఏదైనా డిగ్రీ లేదా బి.టెక్ విద్యార్హత కలిగిన వారు అర్హులని కళాశాల ప్రిన్సిపాల్ యస్. కమల సుజాత తెలిపారు. ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకు రిలేషన్షిప్ మేనేజర్ క్వాలిఫికేషన్ : 2017, 2018, 2019, 2020, 2021, 2022 పాస్అవుట్ స్టూడెంట్స్/బి.

# ఆగస్టు 23 న విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయండి




కర్నూలు ( విభారె) రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 23 న జరిగే కేజీ నుండి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. శరత్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి కుమార్, పిడిఎస్ యు జిల్లా నాయకులు రమణ పిలుపునిచ్చారు.మంగళవారం కల్లూరు లోని స్థానిక సూర్యనారాయణ భవన్ సీపీఎం కార్యాలయం లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ విద్య రంగాన్ని చీకట్లోకి నెట్టే నూతన జాతీయ విద్యావిధానం - 2020 తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 3,4,5, తరగతులను హై స్కూల్ లో విలీనం ఆపి, విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెం.84,85,117 లను తక్షణమే రద్దు చేయాలని పేర్కొన్నారు. అంతేకాకుండా విద్యార్థులు చదువుకోవడానికి పుస్తకాలు కరువయ్యాయని కావున పెండింగ్ లో ఉన్న పాఠ్యపుస్తకాలు,యూనిఫామ్, విద్యాకానుక కిట్లను పంపిణీ చేయాలని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సాంఘీక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలన్నారు. పీజీ విద్యార్థుల ఉన్నత చదువులకు ఆటంకం కలిగించే జీవో నెం.77 ని రద్దు చేసి, పీజీ విద్యార్థులందరికీ ఫీజు రియంబర్స్ మెంట్ ఇవ్వాలని అన్నారు. అలాగే బైజూస్ ఒప్పందాన్ని రద్దు చేయాలని, కామన్ పీజీ సెట్ ని రద్దుచేయాలని అన్నారు. అలాగే పెండింగ్ లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రియంబర్స్ మెంట్,స్కాలర్ షిప్ బకాయిలను విడుదల చేయాలని అన్నారు. విద్యార్థులకు బస్ ఛార్జీలను తగ్గించాలని అన్నారు.అలాగే ప్రైవేట్, కార్పొరేట్విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ లతో ఆగస్టు 23 న జరిగే కేజీ నుండి పీజీ వరకు జరిగే విద్యాసంస్థల బంద్ ను కల్లూరు మండలంలోని విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించి, విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ,పిడిఎస్ యు నాయకులు శివ,పవన్,మహేష్,గోపాల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ స్వగృహానికి విచ్చేసిన ముస్లిం మత పెద్దలు ముఫ్తీ జుబైర్ ఖాస్మీ మౌలానా

### శాలువా , బొకేలతో మత పెద్దలను సత్కరించిన కర్నూలు ఎమ్మెల్యే



కర్నూలు ఆగష్టు 16 -: స్వతంత్ర దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరం లో ఒక ముఖ్య కార్యక్రమానికి విచ్చేసిన ముఫ్తీ జుబైర్ ఖాస్మీ మౌలానా , కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే స్వగృహానికి మర్యాద పూర్వకంగా వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జామయ్యాతుల్ ఉలమా - ఎ - హింద్ (జనరల్ సెక్రటరీ) ముఫ్తీ జుబైర్ ఖాస్మీ మౌలానా కి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా , బొకేలతో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ సత్కరించారు.

## సుంకులమ్మకు, నాగ దేవతకు వెండి తొడుగులను బహుకరించి,అలంకరించిన ఎమ్మెల్యే కాటసాని కుటుంబం...

కర్నూలు ఆగష్టు 16 -:పాణ్యం నియోజకవర్గ పరిధిలోని,కల్లూరు అర్బన్ లోని 35 వ వార్డులో (ఎమ్మెల్యే ఇంటికి సమీపంలో ఉన్న) సుంకులమ్మ గుడిలోని సుంకులమ్మ విగ్రహానికి , పక్కనే ఉన్న నాగ దేవత విగ్రహాలకు పాణ్యం ఎమ్మెల్యే , టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి , కాటసాని ఉమామహేశ్వరమ్మ , యువనేత కాటసాని శివ నరసింహ రెడ్డి , ఎమ్మెల్యే కాటసాని ఇద్దరి కుమార్తెలు మంగళవారం వెండి తొడుగులను బహుకరించి,వాటిని సాంప్రదాయ పద్దతిలో పూజా కార్యక్రమం ద్వారా అలంకరించారు .ఈ కార్యక్రమంలో...35 వ వార్డు కార్పొరేటర్ కుమారి సాపురు మాధురి, సాపురు వీరయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి మిడుతూరు శ్రీనివాసులు యాదవ్, 32 వ వార్డ్ కార్పొరేటర్ , స్టాండింగ్ కమిటీ మెంబర్ సాన శ్రీనివాసులు, కార్పొరేటర్లు మైతాపు నరసింహులు, ఎరుకల వెంకటేశ్వర్లు, కో-ఆప్షన్ మెంబర్ కృష్ణమూర్తి, రంగప్ప , వార్డులోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కాశన్న,రామారావు, సంగెం,శివారెడ్డి, పుల్లన్న,ఆంజనేయులు, మహిళా సంఘాలు నాయకురాలు దామోదరం నాగమని తదితరులు పాల్గొన్నారు...

# అందరూ బాగా పని చేయాలి



### -: కర్నూలు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ సైబర్ నేరాల నివారణకు చర్యలు తీసుకోవాలి జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ

కర్నూలుఆగష్టు 16 -: పోలీసు వ్యవస్థలో అందరూ బాధ్యతగా పని చేయాలని , సైబర్ నేరాల నివారణకు చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం స్ధానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ నెల వారీ , నేర సమీక్షా సమావేశం నిర్వహించి పోలీసు అధికారులతో మాట్లాడారు. కర్నూలు సబ్ డివిజన్ , ఆదోని సబ్ డివిజన్ లోని కేసుల గురించి జిల్లా ఎస్పీ సమీక్షించారు. పెండింగ్ కేసులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టుల గురించి అడిగి తెలుసుకున్నారు . జూనియర్ ఇన్విస్టిగేషన్ అధికారులు, కంప్యూటర్ కానిస్టేబుళ్ళు, ఐటి కానిస్టేబుళ్ళు గా శిక్షణ పొందిన వారిని ఎస్హెలు బాగా మానిటరింగ్ చేయాలన్నారు. అందరి చేత బాగా పని చేయించాలన్నారు. పెండింగ్ కేసులు తగ్గించాలన్నారు. లోక్ అదాలత్ లో ఐపిసి కేసుల పరిష్కారంలో కృషి చేసిన పోలీసులను అభినందిస్తున్నామన్నారు. ఇదే స్పూర్తితో భవిష్యత్తులో ఇంకా బాగా పని చేయాలన్నారు. నూతన సాంకేతిక ( ఎ ఎ ) పరిజ్ఞానం పై మూడు నెలలో పోలీసులకు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో పూర్ధి స్థాయి లో శిక్షణ ఇప్పిస్తామన్నారు. జిల్లా అధికారులందరూ సైబర్ నేరాల పట్ల పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ప్రాథమిక దర్యాప్తు, ఎ యాక్ట్ చట్టాల పై సమగ్ర పట్టు సాధించి సైబర్ నేరాలకు పాల్పడే వ్యక్తులకు కఠిన శిక్షలు పడే విధంగా కేసులలో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలన్నారు. సైబర్ నేరాల నివారణకు ప్రజలలో అవగాహనే కీలకమన్నారు.

# సౌత్ లో 'డార్లింగ్స్' రీమేక్.. అదీ షారుక్ ఖాన్ లెక్క!




బాలీవుడ్ నటి అలియాభట్ ప్రధాన పాత్రలో నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ అయిన 'డార్లింగ్స్' ఎంత పెద్ద సక్సెస్ సాధించిందో తెలిసిందే. 16 దేశాల్లో ట్రెండింగ్ లో నిలిచిన చిత్రమిది. భార్యాభర్తల బాండింగ్ గురించి దర్శకురాలు జస్మీత్ . కె. రీన్ చెప్పిన విధానం విదేశీయులకు ఎంతగానో? కనెక్ట్ అయింది. హిందీ ఆడియన్స్ ని ఆకట్టుకుంది.అయితే ఇప్పుడీ చిత్రాన్ని తెలుగు..తమిళ భాషల ప్రేక్షకులకు అందించడానికి షారుక్ ఖాన్ చిత్ర నిర్మాణ సంస్థ రెడ్ చిల్లీస్ ఎంటర్ టైన్ మెంట్స్ రెడీ అవుతోంది. ఈ రెండు భాషల్లో 'డార్లింగ్స్' ని రీమేక్ రూపంలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ సీఈవో గౌరవ్ వర్మ రివీల్ చేసారు. సినిమాకి మంచి విజయం వచ్చింది."హిందీ భాషకే ఈ విజయాన్ని పరిమితం చేయాలనుకోవడం లేదు. ఇతర భాషల్లోనూ డార్లింగ్స్ రీమేక్ చేయాలనుకుంటున్నాం. ముందుగా తెలుగు..తమిళ భాషల్లో రూపొందిస్తామని" తెలిపారు. ఈ రెండు భాషల్లో తెరకెక్కించి మిగతా భాషల్లోకి అనువదించే అవకాశం ఉంది. మరి ఈ సినిమా నిర్మాణంలో అలియా కూడా భాగమయ్యే అవకాశం ఉందా? అంటే అవుననే గుసగుసవినిపిస్తుంది.మాతృకలో రెడ్ చిల్లీస్ ఎంటర్ టైన్ మెంట్స్ లో పారితోషికంనే అమ్మడు పెట్టుబడిగా పెట్టి నటించింది. సినిమాని నెట్ ఫ్లిక్స్ విక్రయించి మంచి లాభాలు ఆర్జించింది. రీమేక్ హక్కుల్లో అలియాకి కూడా భాగం ఉంది. ఈ నేపథ్యంలో తెలుగు.తమిళ్ భాషల్లో ఆమె కూడా భాగస్వామి అయ్యే అవకాశం ఉందని బాలీవుడ్ వర్గాల సమాచారం.ఆర్ ఆర్ ఆర్ సినిమాతో అలియా టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చింది. డేట్లు సర్దుబాటు సహా గర్భం దాల్చిన నేపథ్యంలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ 30వ సినిమా అవకాశం వదులుకోవాల్సి వచ్చింది. టాలీవుడ్ పాన్ ఇండియా క్రేజ్ నేపథ్యంలో అలియా సైతం ఇక్కడి సినిమాల్లో నటించాలని ఆసక్తిగానే ఉంది. ఈ కారణాలు కూడా అలియాని రీమేక్ నిర్మాణంలో భాగం చేయడానికి దోహంద చేస్తాయని తెలుస్తోంది. ఇక ఇదే సినిమాతో రెడ్ చిల్లీస్ ఎంటర్ టైన్ మెంట్స్ తెలుగు..తమిళ్ లోకి అడుగు పెడుతుంది.ఇప్పుడిప్పుడే షారుక్ సైతం సౌత్ మార్కెట్ వైపు చూస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కోలీవుడ్ యంగ్ మేకర్ అట్లీతో 'జవాన్' సినిమా చేస్తున్నాడు. ఇందులో హీరోయిన్ గా నయనతార సహా తమిళ్ నటుల్ని భాగం చేస్తున్నాడు. ఆ రకంగా షారుక్ సౌత్ స్ట్రాటజీ బయట పడింది. తాజాగా రెడ్ చిల్లీస్ 'డార్లింగ్స్' ని స్థానిక భాషల్లో రీమేక్ చేయడం వెనుక ఇదే స్ట్రాటజీ కనిపిస్తుంది.

# హీరోగా 36 రన్స్ పూర్తిచేసిన వెంకీ!

వెంకటేశ్ .. బలమైన సినిమా నేపథ్యం కలిగిన ఫ్యామిలీ నుంచి వచ్చారు. వెంకీ సినిమాల్లోకి రావడానికి ముందునుంచే రామానాయుడు స్టార్ ప్రొడ్యూసర్. అయినా బాలనటుడిగా వెంకీ చేసింది ఒక సినిమానే. చదువు పూర్తయిన తరువాతనే వెంకటేశ్ ను సినిమాల వైపుకు తీసుకుని రావాలని రామానాయుడు అనుకున్నారు. వెంకటేశ్ కూడా చదువుపైనే దృష్టి పెట్టారు. వెంకటేశ్ ఫారిన్ లో చదువును పూర్తి చేసే స్థాయికి వచ్చారు. అప్పుడు హీరోగా చేయడానికి




వచ్చేయమని ఆయనకి తండ్రి నుంచి కాల్ వెళ్లింది. అంతే వెంకటేశ్ ఇండియాలో వాలిపోయారు.రామానాయుడు సూపర్ స్టార్ కృష్ణతో ఒక సినిమా చేయాలనుకున్నారు. ఆ సినిమాకి రాఘవేంద్రరావుని దర్శకుడిగా అనుకున్నారు. కానీ కృష్ణ బిజీగా ఉండటం వలన ప్రాజెక్టు ఆలస్యమయ్యేలా ఉంది. రాఘవేంద్రరావు ఇచ్చిన డేట్స్ లోనే తన బ్యానర్ లో సినిమాను పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఉన్న రామానాయుడు హీరోగా వెంకటేశ్ ను రంగంలోకి దింపాలని భావించారు. అందుకే ఆయనను పిలిపించారు. ఈ లోగానే పరుచూరి బ్రదర్స్ కథను సిద్ధం చేసేశారు. ఆ సినిమానే 'కలియుగ పాండవులు'.ఈ సినిమాతో కథానాయికగా ఖుష్బూను .. ప్రతినాయకుడిగా శక్తికపూర్ టాలీవుడ్ కి పరిచయం చేశారు.1986 ఆగస్టు 14వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. చక్రవర్తి సంగీతాన్ని అందించిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లను రాబట్టింది. 14 కేంద్రాలలో 50 రోజులను పూర్తి చేసుకుంది. విజయవాడలో 100 రోజుల వేడుకను జరుపుకుంది.అలా తొలి సినిమాతోనే వెంకటేశ్ సక్సెస్ ను అందుకున్నారు. తన తొలి సినిమా ఈ రోజుతో 36 ఏళ్లను పూర్తి చేసుకుంది. అంటే హీరోగా వెంకటేశ్ 36 వసంతాలను పూర్తిచేసుకున్నాడన్న మాట. ఎంత బలమైన బ్యాక్ గ్రౌండ్ ఉన్నప్పటికీ ఇక్కడ నిలబడాలంటే సామాన్య ప్రేక్షకుడిని మెప్పించవలసిందే.అలా వెంకటేశ్ సినిమాకి .. సినిమాకి తనని తాను మార్చుకుంటూ డైలాగ్ డెలివరీలో .. డాన్సులలో .. ఫైట్లలో .. బాడీ లాంగ్వేజ్ లో మార్పులు చేసుకుంటూ .. ఎదుగుతూ వచ్చారు. స్టార్ హీరోలలో తనదైన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు.

# దేవీశ్రీ- తమన్ లను వెనక్కి నెడతాడా?

సంగీతం పలు రకాలు.. చెవిలో రొద పెట్టేది.. చెవికి ఇంపుగా ఉండేది.. ఈ రెండూ కాకుండా ఉర్రూతలూగించే సంగీతం వేరు. అవసరానికి తగ్గట్టు కేటగిరీ వైజ్ సంగీతం అందించాలి. సినిమా థీమ్ ను నడిపించే బీజీఎంతో మనసులు గెలుచుకోవాలి. అప్పుడు మాత్రమే ఆ సంగీత దర్శకుడికి గౌరవం దక్కుతుంది. ఇళయరాజా- ఏ.ఆర్.రెహమాన్- ఎం.ఎం.కీరవాణి- హ్యారిష్ జైరాజ్- మణిశర్మ లాంటి ట్యాలెంట్ తర్వాత దేవీశ్రీ- తమన్ లాంటి వాళ్ల



హవా కొనసాగుతోంది. ఇంకా ఎందరో ఉన్నా కానీ ట్రెండింగ్ లో కొనసాగుతున్న పేర్లు ఇవన్నీ.ఇప్పుడు మరో యువ సంగీత దర్శకుడి పేరు ప్రముఖంగా ట్రెండ్స్ లో వినిపిస్తోంది. లెజెండరీ ఓఓ కీరవాణి తనయుడు కాల భైరవ పేరు ఇటీవల మార్మోగుతోంది. తాజాగా నిఖిల్ నటించిన హిట్ చిత్రం 'కార్తికేయ 2' కోసం అతని మ్యూజిక్ స్కోర్ - ఃఓఓ ప్రశంసలు దక్కించుకుంటున్నాయి. కార్తికేయ 2 చిత్రాన్ని మరో స్థాయికి పెంచిన సంగీతం అతడి నుంచి పుట్టుకొచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో మొదటి షో పూర్తయిన క్షణం నుండి కాలభైరవ పనితనంపై పెద్ద ఎత్తున ప్రశంసలు కురిసాయి.అడ్వెంచర్ థ్రిల్లర్ కార్తికేయ 2కి కొత్త సౌండింగ్ ని క్రియేట్ చేసిన విధానం అందరినీ ఆకట్టుకుంది. కాలభైరవ బాబాయ్.. ప్రముఖ దర్శకుడు రాజమౌళి .. నాన్న కీరవాణి ఇంతకుముందే హైదరాబాద్ లో షోను వీక్షించారు. అనంతరం యువ సంగీతకారుడిని గర్వంగా కౌగిలించుకోవడం ప్రీమియర్ హాల్ లో కనిపించింది. కాల భైరవ సంగీతం అందించిన 'కలర్ ఫోటో' ఇటీవల జాతీయ అవార్డును కూడా గెలుచుకుంది మత్తు వదలరా చిత్రానికి అతడు చక్కని సంగీతం అందించాడు. ఇప్పుడు అరడజనుకు పైగా చిత్రాలతో బిజీగా ఉన్నాడు. అతడు కీరవాణికి మాత్రమే కాదు మునుముందు లీడ్ లో ఉన్న సంగీత దర్శకులకు పోటీ కాగలడు.ప్రస్తుతం టాలీవుడ్ లో లీడ్ లో ఉన్న పేర్లలో ఓ ఇరువురు మ్యూజిక్ డైరెక్టర్ల పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. దేవీశ్రీ ప్రసాద్.. తమన్ మెజారిటీ పార్ట్ భారీ ప్రాజెక్టులను ఛేజిక్కించుకుంటున్నారు. ఆ ఇద్దరికీ కాల భైరవ పోటీగా నిలుస్తారా? అన్నదానికి కాలమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

# నిమిషాల్లో అమ్ముడుపోయిన భారత్- పాక్ మ్యాచ్ టికెట్లు.. ఒకేసారి 7.5 లక్షల మంది దండయాత్ర




క్రికెట్లో దాయాదుల పోరును ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులు ఎప్పటిలాగే మరోసారి ఎగబడ్డారు. ఆసియా కప్-2022లో భాగంగా ఆగస్ట్ 28న జరుగనున్న భారత్-పాక్ మ్యాచ్కు సంబంధించిన టికెట్ల అమ్మకాన్ని నిన్న (ఆగస్ట్ 15) ప్రారంభించగా, యధాతథంగా నిమిషాల వ్యవధిలోనే హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి.టోర్నీ నిర్వహకులు యూఏఈలో అత్యంత ప్రజాదరణ కలిగిన ప్లాటినంలిస్ట్ (ఖశ్రీజీబితినిబీఎశ్రీతిబబి) అనే వెబ్సైట్కు టికెట్ల అమ్మకపు బాధ్యతలు అప్పజెప్పగా.. ఆన్లైన్ సేల్ ప్రారంభమైన నిమిషాల వ్యవధిలో (రాత్రి 7:30 గంటలకు) ఏకంగా 7.5 లక్షల మంది అభిమానులు సైట్పై ఒకేసారి దండయాత్ర చేశారు. దీంతో సైట్ క్రాషై టికెట్ల విక్రయానికి కాసేపు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ కంట్రోల్ చేసేందుకు నిర్వహకులు 'క్యూ' (ఆన్లైన్) పద్దతిని పాటించారు. అయినప్పనటికీ చాలామంది అభిమానులుకు నిరాశే ఎదురైంది. టికెట్ల అమ్మకాల విషయంలో ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) నిబంధనలు పాటించలేదని టికెట్ ఆశావహులు ఆరోపిస్తున్నారు.టికెట్ల అమ్మకాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, టీ20 వరల్డ్కప్ 2022లో భాగంగా అక్టోబర్ 28న జరుగనున్న భారత్-పాక్ మ్యా?చ్కు సంబంధించిన టికెట్లు కూడా ఇలాగే ఒక్కరోజులోనే ఖతమైన విషయం తెలిసిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**